

స్నేహమేరా శాశ్వతం

నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా..


- కష్టసుఖాల్లో తోడుండే వారే నిజమైన స్నేహితులు
- నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావులేదు
- ధనిక, పేద అనే తారతమ్యాలూ ఉండవు

-8లో



ది డెక్‌లో రైల్వే జోన్ కార్యాలయం


- 6, 7 అంతస్థుల కేటాయింపు
- వచ్చే వారం ఎంఓయూ: ఎంపీ శ్రీభరత్



ఇందులోనే రైల్వే జోన్ కార్యాలయం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం ఎక్కడ నిర్వహించాలనేది ఎట్టకేలకు ఖరారైంది. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనంలో జోన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటుచేయడానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇందులో 6, 7 అంతస్థులను (సుమారు 41,500 చ.అ.) కేటాయించడానికి వీఎంఆర్‌డీఏ సుముఖత వ్యక్తంచేసింది. వాస్తవానికి గత నెలలోనే రైల్వే అధికారులు వీఎంఆర్‌డీఏ నుంచి వివరాలు తీసుకొని, ఢిల్లీలోని రైల్వే బోర్డుకు పంపించారు. కానీ దానిని వారు పట్టించుకోలేదు. ఇటీవల దీనిపై 'రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా పార్లమెంటు సమావేశాలకు ఢిల్లీ వెళ్లిన విశాఖ ఎంపీ శ్రీభరత్ అక్కడి రైల్వే బోర్డు అధికారులతో ... మిగతా 6వ పేజీలో

అన్నదాత సుఖీభవ



గాజువాక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ వికాస్' పథకం మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో రైతులకు నమూనా చెక్ అందజేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు. - వివరాలు 8వ పేజీలో

భారీగా మత్తు ఇంజక్షన్లు పట్టివేత

- నాలుగు కిలోల గంజాయి కూడా...
- ఒకరిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్


గంజాయి, మత్తు ఇంజక్షన్లతో పట్టుబడిన బిపిన్‌కుమార్ ఘోష్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో భారీగా నిల్వ చేసిన మత్తు ఇంజక్షన్లతోపాటు నాలుగు కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తదుపరి చర్యలునిమిత్తం ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. దీనికి సంబంధించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తికి చెందిన బిపిన్‌కుమార్ ఘోష్ అలియాస్ ఆషిఫ్ అలియాస్ పెందుర్తి రాజు (36) గతంలో గంజాయి, మత్తు ఇంజక్షన్లు వినియోగించేవాడు. మత్తు ఇంజక్షన్లను రెండు మోచేతులపై చేసుకోవడంతో నరాలు దెబ్బతిని పనిచేయడం మానేశాయి. మత్తు ఇంజక్షన్లు, గంజాయి వాడితే ప్రాణాలు పోతాయని వైద్యులు హెచ్చరించడంతో కొంతకాలంగా వాటిని వినియోగించడం మానేశాడు. భార్య, ఇద్దరు పిల్లలతో తన నివాసాన్ని ఆర్‌అండ్‌బీ సమీపంలోని ఒక అపార్టుమెంట్‌కు మార్చాడు. మత్తుపదార్థాల వినియోగం ఆపేసినప్పటికీ తనకున్న పాతపరిచయాల ద్వారా గంజాయి, మత్తు ఇంజక్షన్లను తీసుకువచ్చి నగరంలో పలువురికి విక్రయించడం మొదలుపెట్టాడు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో శుక్రవారం నిఘా పెట్టి పెందుర్తి రాజు తన ఇంట్లోకి వెళుతున్నప్పుడు ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో ఇంట్లో నాలుగు కిలోలు గంజాయి, మత్తు కలిగించే పెంటాజోసిన్ ఇంజక్షన్లు 900 లభ్యమయ్యాయి.తదుపరి చర్యలునిమిత్తం నిందితుడితోపాటు సీజ్ చేసిన గంజాయి, మత్తు ఇంజక్షన్లను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.

పీసీబీ బోర్డులో ఇద్దరు విశాఖ వాసులు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలిలో ప్రభుత్వం నియమించిన ముగ్గురు అనధికార సభ్యుల్లో ఇద్దరు విశాఖకు చెందినవారు. భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, ఏయూలోని బయోటెక్నాలజీ విభాగం విశ్రాంత ఆచార్యుడు భాగవంతుల సందీప్‌లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు మూడేళ్లపాటు పదవిలో ఉంటారు.

బేకరీల్లోనూ అదే సీన్

విచ్చలవిడిగా రంగులు, రసాయనాలు వినియోగం

- రోజుల తరబడి నిల్వ ఉంచి విక్రయం
- స్వీట్స్, కేక్స్ దుకాణాల్లో కూడా...
- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో బహిర్గతం
- 39 నమూనాలను సేకరించి పరీక్షలకు పంపిన అధికారులు
- 16 కేసుల నమోదు
- నగరంలోని 40 షాపుల్లో సోదాలు
- గడువు తీరిన వస్తువులతో అపరిశుభ్ర వాతావరణంలో ఉత్పత్తులు తయారు చేస్తున్నట్టు గుర్తింపు


మద్దిలపాలెం వద్ద ఎస్‌ఎస్‌ఎస్ బేకరీలో బ్రెడ్‌లను తనిఖీ చేస్తున్న ఆహార భద్రతా అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వీట్లు, కేకులు బాగా తింటున్నారా?, తరచూ బేకరీ ఐటమ్స్ కొనుగోలు చేస్తున్నారా?...అయితే మీరు ఆరోగ్యం గురించి ఒక ఆలోచించుకోవాల్సిందే. ఎందుకంటే నగర పరిధిలో స్వీట్లు, బేకరీల్లో విక్రయించే ఉత్పత్తుల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, రంగులను అధిక మోతాదులో వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో బయటపడింది.

తూనికలు, కొలతల శాఖ అధికారులతో కలిసి 20 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించారు. దాదాపు 90 శాతం దుకాణాల్లో అత్యంత దారుణమైన వాతావరణంలో ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు గుర్తించారు. కొంతమంది రోజుల తరబడి నిల్వ ఉంచిన స్వీట్లు, కేకులు, ఇతర బేకరీ పదార్థాలను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో శుక్రవారం తనిఖీలు చేపట్టిన అధికారులు శనివారం స్వీట్స్ దుకాణాలు, బేకరీల్లో సోదాలు చేశారు. స్వీట్లు, కేకులతోపాటు కొన్ని రకాల బేకరీ ఉత్పత్తుల తయారీలో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను అధిక మోతాదు లో వినియోగిస్తున్నట్టు ఈ సందర్భంగా అధికారులు గుర్తించారు. అలాగే గడువు తీరిన రంగులను ఉపయోగిస్తు న్నట్టు తేల్చారు. ముఖ్యంగా రామ్‌నగర్‌లోని బేకరీ డెన్, తగరపువలసలోని దేవీ స్వీట్స్, మర్రిపాలెంలోని రెడ్ వాల్వెట్, మద్దిలపాలెంలోని ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది

- కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది...
- నామినేషన్ ఉపసంహరించుకున్న మహ్మద్ సాదిక్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది నిలిచారు. కమిటీలో పది మంది సభ్యులను ఎన్నుకునేందుకు గత నెల 21న కమిషనర్ కేతన్‌గార్గ్ నోటిఫికేషన్ జారీచేయగా, 21 మంది నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వారిలో కూటమి నుంచి 11 మంది, వైసీపీ నుంచి పది మంది ఉన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి జనసేన దూరంగా ఉంటున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ పార్టీకి మద్దతు ప్రకటించిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ (39వ వార్డు) మహ్మద్ సాదిక్ నామినేషన్ దాఖలు చేయడం కూటమి అభ్యర్థుల్లో కలకలం రేపింది. చివరకు జనసేన పార్టీ నేతల ఆదేశాలు మేరకు మహ్మద్‌సాదిక్ శనివారం అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ ఛాంబర్‌కు వెళ్లి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది మాత్రమే పోటీలో నిలిచినట్టయ్యింది. జీవీఎంసీ కౌన్సిల్‌లో కూటమికి 63 మంది, వైసీపీకి 34 కార్పొరేటర్ల బలం ఉంది. దీంతో కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమేననే ... మిగతా 6వ పేజీలో

డ్వాక్రా దుకాణాలకు పైరవీలు

నగరంలోని 13 రైతుబజార్లలో 72 దుకాణాలు

- టమాటా, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు విక్రయించుకునే అవకాశం
- వ్యాపారం బాగుండడంతో భారీగా దరఖాస్తులు
- రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నజరానాలు
- ఎమ్మెల్యేల ద్వారా సిఫారసులు
- జేసీ సమక్షంలో లాటరీ రేపు
- పారదర్శకంగా జరిగేనా?


రైతుబజార్‌లోని డ్వాక్రా స్టాల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని రైతుబజార్లలో దుకాణాల కోసం డ్వాక్రా సంఘాల సభ్యులు పోటీ పడుతున్నారు. ఇందుకోసం ఒక్కో గ్రూపు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకూ నజరానాగా సమర్పించడానికి సిద్ధపడుతోంది.

విశాఖ జిల్లాలో మొత్తం 13 రైతుబజార్లు ఉండగా, వాటిలో 72 డ్వాక్రా దుకాణాలు, మరో 28 దివ్యాంగుల దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని గత నెలలో జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. ప్రతి డ్వాక్రా గ్రూపు మూడేళ్ల తరువాత ఖాళీ చేసి వెళ్లిపోవాలనే నిబంధనతో ఈ దుకాణాలు కేటాయిస్తున్నారు. వీటి ద్వారా బజార్లలో టమాటా, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు విక్రయించుకునే అవకాశం ఉంది. భారీగా వ్యాపారం జరుగుతున్నందున వీటి కోసం చాలామంది పోటీ పడుతున్నారు. ఇప్పుడు భారీగా దరఖాస్తులు రావడంతో సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టరేట్ సమక్షంలో ... మిగతా 6వ పేజీలో

బడుల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు

కమిటీల ఖాతాల్లో ఉన్న నిధులు వినియోగించవద్దని విద్యా శాఖ ఆదేశాలు

- 'మనబడి-మన భవిష్యత్తు'కు గత వారం రూ.250 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- పనులు పూర్తవుతాయని భావించిన జిల్లా అధికారులు
- అయితే...ఆ నిధులు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ బకాయిల నిమిత్తం విడుదల చేసినట్టు వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల పునఃప్రారంభం మరికొంత ఆలస్యమయ్యేలా ఉంది. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాల్లో ఉన్న నిధులతో ఆ పనులు చేయవద్దని విద్యా శాఖ ఆదేశించింది. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం రెండో దశ పనులు 2022లో ప్రారంభించింది. జిల్లాలోని 309 పాఠశాలల్లో మౌలిక వసతులు అంటే అదనపు గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, లేబొరేటరీలు, లైబ్రరీలు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఎల్‌ఈడీ ప్యానల్ ఏర్పాటుకు సుమారు రూ.115 కోట్లు కేటా యించేందుకు ఆమోదం తెలిపింది. అయితే రెండో దశకు మొదటి నుంచి నిధుల సమస్య వెంటాడింది. రూ. 48.73 కోట్లు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం రూ.46.35 కోట్ల విలువైన మెటీరియల్ సరఫరా చేసింది. అందుబాటులో ఉన్న నిధులు, మెటీరియల్‌తోనే పాఠశాలల్లో పనులు ప్రారం భించారు. అయితే అనుకున్న లక్ష్యం మేర పనులు పూర్తికి నిధుల సమస్య ఏర్పడింది. మొత్తం 522 అదనపు గదుల నిర్మాణం చేపట్టగా, చాలావరకూ మధ్యలో ఉండిపోయాయి.


అమనాం పాఠశాలలో అసంపూర్తి నిర్మాణం

చంద్రంపాలెం ఉన్నత పాఠశాల సహా పలుచోట్ల రెండేళ్ల నుంచి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తరగతి గదులు చాలని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పాఠశాలల ఆవరణల్లో ఇసుక, రాళ్లగుట్టలు ఉండడం ఇబ్బందిగా ఉంది. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కొనుగోలు చేసిన తలుపులు, కిటికీలను అమర్చేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ఇప్పటివరకూ రాలేదు. అవి కూడా పాఠశాలల్లో ఒకచోట ఉంచారు. అయితే కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తిచేయగా, సుమారు రూ.80 లక్షల వరకు కమిటీల ఖాతాల్లో ఉన్నాయి. ఈ ... మిగతా 6వ పేజీలో

ఆర్‌ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

- అడ్డగోలు ఇంక్రిమెంట్లు కట్
- ఇప్పటివరకూ తీసుకున్న మొత్తం రికవరీపైనా కసరత్తు
- నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పదోన్నతులపైనా దృష్టి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్‌ఈసీఎస్)లో అడ్డగోలుగా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందిన వారిపై చర్యలు మొదలయ్యాయి. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు 53 మంది అక్రమార్కులు ఉన్నట్టు తేల్చి వారి జీతాల్లో కోత విధించారు. ఆగస్టు ఒకటో తేదీన బ్యాంకులో పడిన జీతాలు చూసుకున్న ఆయా ఉద్యోగులు ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ. 15 వేలు కోత పడినట్టు గుర్తించి లబోదిబోమంటున్నారు.



అనకాపల్లి ఆర్‌ఈసీఎస్‌లో చాలాకాలంగా అక్రమాలు జరుగుతున్నాయి. వాటిని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్న సంగతి తెలిసిందే. గత మే నెలలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త పీఆర్‌సీ ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. సహకార శాఖ కమిషనర్ అనుమతి లేకుండానే పాత తీర్మానం ప్రకారం జీతాలు ఇచ్చేశారు. దీనిపై విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో కొందరు అడ్డగోలుగా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని ఫిర్యాదు అందడంతో దానిపై ఈపీడీసీఎల్ అధికారులు విచారణ చేపట్టారు. కొందరు సస్పెన్షన్ కాలంలో కూడా ఇంక్రిమెంట్లు తీసుకున్నట్టు గుర్తించారు. అలాగే నాలుగేళ్లకు ఒకసారి పదోన్నతి ఇవ్వాలనేది నిబంధన కాగా కొందరు రెండేళ్లకే తీసుకున్నట్టు తేలింది. సహకార శాఖ పరిధిలో సంస్థ నడిచినప్పుడు నాటి మేనేజింగ్ డైరెక్టర్, ప్రాజెక్టు ఇంజనీర్ కలిసి వారికి నచ్చినట్టు చేశారని తేలింది. కొందరు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి వారు కోరుకున్న ... మిగతా 6వ పేజీలో

తిరుపతి, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

- సెప్టెంబరు నెలాఖరు వరకూ నడపనున్నట్టు అధికారుల వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి, విశాఖ-చర్లపల్లి మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక వారాంతపు రైళ్లను సెప్టెంబరు నెలాఖరు వరకూ నడపాలని నిర్ణయించినట్టు విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-తిరుపతి (08547) ప్రత్యేక రైలు ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 24 వరకు ప్రతి బుధవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి-విశాఖ (08578) ప్రత్యేక రైలు ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 25 వరకు ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది. విశాఖ-చర్లపల్లి (08579) ప్రత్యేక రైలు ఈ నెల 8 నుంచి సెప్టెంబరు 26 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి-విశాఖ (08580) ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి సెప్టెంబరు 27 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు విశాఖ చేరుతుంది.

ఫేక్ సర్టిఫికెట్లపై ఏయూ దృష్టి

డిగ్రీ కోర్సుల్లో చేరిన ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆదేశం

- ఈ నెల 20 వరకూ అవకాశం
- అవి పరీక్షించిన తరువాతే ఫలితాలు వెల్లడి



విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో చేరిన విద్యార్థులపై అధికారులు దృష్టిసారించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు ఫేక్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో ఇక్కడ డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన ఏయూ అధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ టీవీ కృష్ణ ఏయూ పరిధిలోని డిగ్రీ కాలేజీలకు కీలక ఆదేశాలను జారీచేశారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ ... మిగతా 6వ పేజీలో



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

భక్తులతో సింహగిరి కిటకిట

సింహాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి భక్తులతో శనివారం కిటకిటలాడింది. అప్పన్న స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుండే కొండదిగువ ప్రాంతాల్లో సందడి నెలకొంది. తొలుత వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవ స్వామిని దర్శించుకున్న భక్తులు అమృత కలశాల మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి మెట్ల మార్గంలో చేరుకున్నారు. కేశ ఖండనశాలలో తలనీలాలు సమర్పించి, గంగధారలో స్నానాలు ఆచరించి అప్పన్నను దర్శించుకున్నారు.

శ్రీవారి భక్తులకు వసతి కరువు



ఆలయం వద్ద ఎండలో బారులు తీరిన భక్తులు

సాగర్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. మెట్ల మార్గంలోను, రోడ్డు మార్గంలోను గంటల తరబడి ఎండలో వేచి ఉన్నారు. అధికారులు స్పందించి వసతి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

6న జీవీఎంసీ దుకాణాలకు వేలం

తగరపువలస, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో ఉన్న జీవీఎంసీ దుకాణాలకు ఈనెల 6న వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సంతపేట సచివాలయం వద్ద కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయంలో 3 దుకాణాలకు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న మూడు దుకాణాలకు ఆ రోజు ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు.మూడేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనే వారు ఆధార్, పాన్ కార్డు, ఎస్సీ, ఎస్టీలు అయితే కుల ధ్రువీకరణపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ సీపీఎం ధర్నా

తగరపువలస, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చిట్టివలస సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, నాయకులు మూర్తి, అప్పలనాయుడు, నాగరాజు, ముద్దాడ రాము, పంపాన సూర్యనారాయణ, దామోదర బాబాజీ, పల్ల పెంటరాజు, నమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'ది డెక్'లో రైల్వే జోన్ కార్యాలయం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వెంటనే కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. దాంతో బోర్డు అధికారులు విశాఖ నుంచి వెళ్లిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అప్‌సెట్ ధర అంటే చ.అ. రూ.70 చొప్పున ఇవ్వడానికి వీఎంఆర్‌డీఏ అంగీకరించింది.

వారం రోజుల్లో ఎంఓయూ: శ్రీభరత్

ది డెక్‌లో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వారం రోజుల్లో వీఎంఆర్‌డీఏ, రైల్వే మధ్య ఎంఓయూ జరుగుతుందని, ఆ తరువాత ఇంటీరియర్ పనులు ప్రారంభించి కార్యాలయం ప్రారంభిస్తారని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జోన్ గెజిట్ నోటిఫికేషన్, జోన్ ఆపరేషన్ తేదీ కూడా త్వరలోనే వస్తుందన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ఏయూ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కోర్సుల్లో చేరిన విద్యార్థుల ఈక్వెలెన్స్ (రాష్ట్రానికి చెందిన ఇంటర్మీడియట్ బోర్డుతో సమానంగా గుర్తించేలా) సర్టిఫికెట్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను యూనివర్సిటీకి పంపించాలని ఆదేశించారు. ఆయా విద్యార్థులు ఈ రెండు సర్టిఫికెట్లను ఈ నెల 20వ తేదీలోగా వర్సిటీకి అందించాలని, వాటిని సరిచూసిన తరువాతే సదరు విద్యార్థుల ఫలితాలను వెలువరిస్తామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో ఫేక్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థుల లెక్క తేలుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా చర్యలు ద్వారా భవిష్యత్తులో ఈ తరహా ప్రవేశాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.



వ్యవసాయ డ్రోన్‌ను అధికారులకు అందిస్తున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయులు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సభా ప్రాంగణానికి ఎడ్ల బండిపై వస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

స్వర్ణాంధ్ర సాధనే కూటమి లక్ష్యం

- రైతులకు సాయం చేయడంలో దేశంలోనే రాష్ట్రం ముందంజ
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయులు
- పాండ్రంగిలో అన్నదాత సుఖీభవ సభ

పద్మనాభం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అత్యధిక సాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయులు అన్నారు. శనివారం ఆయన పాండ్రంగి గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ సభలో మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. అందులోభాగంగానే పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతులకు రూ.3,174 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. భీమిలి నియోజకవర్గంలో ఇనాం రైతులకు కూడా పథకం అందేలా చేస్తామని చెప్పారు. జిల్లాలో 18 వేల మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయిన వెంటనే ఈనెల 15న పాసు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. రైతుల పంట బీమా సొమ్మును మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎగవేశారని విమర్శించారు.విశాఖ అభివృద్ధిపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. నియోజకవర్గంలో రానున్న ఐటీ, పర్యాటక ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 15 వేల మంది రైతులకు రూ.10 కోట్లు అన్నదాత సుఖీభవ కింద పంపిణీ చేశామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు ప్రభుత్వం చేసేది సాయం కాదని బాధ్యత అని చెప్పారు. తొలుత మంత్రి, ఎమ్మెల్యే సభ వద్దకు ఎడ్ల బండిపై ఊరేగింపుగా వచ్చారు. అనంతరం పాండ్రంగి నుంచి సంగివలస వరకు రూ.1.10 కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ డ్రోన్‌ను వ్యవసాయ శాఖాధికారులకు అందజేశారు.అలాగే గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ సంగీత్ మాథూర్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ రామస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, నాయకులు దామోదరరావు, నందీశ్వరరావు, రామరాజు, లీలావతి, గాడు వెంకటప్పడు, డీఏఎన్ రాజు, అప్పలరాజు, బీఆర్‌బీ నాయుడు వరహా నరసింహం, శ్రీనివాస్, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన,నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, భూదేవి, నీలాదేవిలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

జనసేన నాయకుడు సందీప్‌కు సత్కారం



ఎండాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సందీప్‌ను ప్రభుత్వం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శిగా నియమించిన విషయం తెలిసిందే. ఈమేరకు ఎండాడలోని పార్టీ కార్యాలయంలో 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన సైనికుల, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే రోడ్డు విస్తరణ

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- జోనల్ అధికారులతో సమీక్ష

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :భీమిలి పోలీసు స్టేషన్ నుంచి తగరపువలస బైపాస్ వరకు (ఆరు కిలోమీటర్లు) 150 అడుగుల మేర విస్తరించనున్న రహదారి పనులను ప్రజాభిప్రాయం మేరకు చేపట్టాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉన్న తన నివాసంలో జడ్సీ అయ్యప్పనాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటవాసు, ఏసీపీ రామకృష్ణతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సిద్ధం కానుందని, ఈ రోడ్డులో రాకపోకలు బాగా పెరుగుతాయని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే 150 అడుగుల రోడ్డును ప్రతిపాదించామని చెప్పారు. రోడ్డు విస్తరణకు ఎన్ని కట్టడాలు, ఎన్ని ఖాళీ స్థలాలు పోతాయో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని గంటా ఆదేశించారు. రహదారి మధ్యలో ఉన్న చిల్లపేట వద్ద చెరువును కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువులో ప్రవహించే మురుగునీటిని మళ్లించి హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరి చేయడానికి ఎంత వ్యయం అవుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వాసును అడగ్గా రూ. 2 కోట్ల మేర అవుతుందని, అందుకు సంబంధించిన రిపోర్టు తయారు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ ప్రాజెక్టు గురించి గతంలో చర్చించానని, దీన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని కోరారు. అలాగే గోస్తనీ నదిపై సామేయవలస వద్ద చెక్ డ్యామ్ నిర్మించినట్లయితే రెండు మిలియన్ లీటర్ల తాగునీరు అదనంగా పంపింగ్ చేయవచ్చునని అధికారులు వివరించారు. సంగివలస వద్ద కొండప్ప చెరువులో చేరుతున్న వర్షం నీరు, మురుగు నీరు డ్రెన్‌లోకి మళ్లించడానికి తయారు చేసిన ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. భీమిలిలో తీరం కోత నివారణకు రూ. 20 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు, అధ్యాపకులు

భీమునిపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి మాట్లాడుతూ త్రివర్ణ పతాక స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ వెంకయ్య ఆంధ్రుడు కావడం మనకు గర్వకారణమన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత పెంపొందించడమే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. తొలుత పలువురు వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, అధ్యాపకులు,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాసన పోటీలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎంవీపీ కాలనీ ఐఐఎం ఆవరణలో ఆదివారం నుంచి జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు తాటితూరు గ్రామానికి చెందిన టీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రెడిషినల్ యోగా, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్ బెండింగ్ ట్విస్టు, లెగ్ బాలెన్సు వంటి పది రకాల పోటీలు జరుగుతాయన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని, 10 నుంచి 55 సంవత్సరాల వయసు గలవారు 12 కేటగిరీల్లో పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు సెల్ నెంబరు 98660 22515 లో సంప్రతించాలని ఆయన సూచించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పాండురంగాపురానికి చెందిన కె. నితీష్ చంద్ర రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవస్థానం పీఆర్‌ఓ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావుకు శనివారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈపీడీసీఎల్ అధికారులు 'రేషనలైజేషన్' పేరుతో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎవరైతే అడ్డగోలుగా ఇంక్రిమెంట్లు, పదోన్నతులు తీసుకున్నారో జాబితా రూపొందించి, వారికి అర్హతల ప్రకారమే జూలై నెల జీతాలు ఇచ్చారు. ఇకపై అవే జీతాలు ఇస్తామని స్పష్టంచేశారు. సగటున ఒక్కొక్కరికి రూ.15 వేలు తగ్గిపోయింది. ఇప్పటివరకూ అడ్డగోలుగా, అదనంగా తీసుకున్న జీతాలను ఎలా రికవరీ చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

డ్వాక్రా దుకాణాలకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

లాటరీ తీసి కేటాయించాలని నిర్ణయించారు.

తెర వెనుక లాబీయింగ్

రైతుబజార్లలో వ్యాపారానికి, అక్కడి లాభాలకు అలవాటుపడిన డ్వాక్రా గ్రూపులు మళ్లీ మళ్లీ దుకాణాలు దక్కించుకోవాలని యత్నిస్తున్నాయి. అందుకని అదే గ్రూపులో వేరే సభ్యుల పేరుతో దరఖాస్తులు సమర్పించారు. మరికొందరు వేరే గ్రూపులో చేరి ఆ పేరుతో దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించే బాధ్యత సిటీలో మెప్మాకు, జిల్లాలో డీఆర్‌డీఏకు అప్పగించారు. దాంతో పాటు గోపాలపట్నంలోని మార్కెటింగ్ శాఖాధికారులు కూడా పరిశీలిస్తున్నారు. కొత్త గ్రూపులకు అవకాశం ఇవ్వాలనేది ప్రభుత్వం ఆలోచన. కానీ ఎలాగైనా మళ్లీ దక్కించుకోవాలని కొన్ని డ్వాక్రా గ్రూపులు యత్నిస్తున్నాయి. దాంతో ఎమ్మెల్యేలు, వారి దగ్గర వ్యక్తిగత సహాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇందుకోసం వారు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకూ ముట్ట జెబుతున్నారు. ఈ మొత్తాలను కొందరు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద తీసుకొని మరీ ఇస్తున్నారు. దుకాణం వస్తే ఆ వ్యాపారుల దగ్గరే అన్నీ కొనాలనేది ఒప్పందం. ఈ నేపథ్యంలో జిల్లాలో ఒక్కో ఎమ్మెల్యే పదేసి గ్రూపుల పేర్లు సిఫారసు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు ఎమ్మెల్యేలు అయితే తమ వారికి ఫలానా బజారులోనే దుకాణం ఇవ్వాలని ఒత్తిడి పెడుతున్నారు.

ఇన్ని సిఫారసుల మధ్య లాటరీ పారదర్శకంగా జరిగే అవకాశం లేదు. గతంలో కూడా మార్కెటింగ్ శాఖలో ఓ అధికారి చక్రం తిప్పి వారి మనుషులకు ప్రధాన బజార్లలో దుకాణాలు ఇప్పించుకున్నారు. అప్పుడు కూడా లాటరీయే తీశారు కానీ వారికి అవసరమైనవి దక్కించుకున్నారు. ఆ అధికారి ఇప్పుడు లేకపోయినా మళ్లీ అదే తంతు నడిపించాలని కొందరు యత్నిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఈ విషయంలో ఎవరినీ విశ్వసించకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా లాటరీ తీయాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

జాబ్ స్కామ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చైనా ఆధారిత జాబ్ స్కామ్ కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జిల్లాకు చెందిన నవీన్‌కు ఆకుల రాజశేఖర్ అలియాస్ రాయ్, నాగేంద్రతో పరిచయం ఉంది. వారు కంబోడియాలో చైనా ఆధారిత జాబ్ స్కామ్ కంపెనీలో పని చేసి దేశంలోని యువకులను ఉద్యోగాల పేరిట మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నవీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆకుల రాజశేఖర్, నాగేంద్ర కోసం ఎల్‌వోసీ (లుక్ అవుట్ సర్క్యులర్) జారీ చేశారు. అలానే మరో కేసులో జిల్లాకు చెందిన మొహమ్మద్ ఆల్తాఫ్ అలీ వేరే వ్యక్తి ద్వారా కంబోడియా వెళ్లి అక్కడ చైనా ఆధారిత జాబ్ స్కామ్ కంపెనీలో పనిచేసి ఇండియా వచ్చాడు. కమీషన్ కోసం 12 మంది నిరుద్యోగ యువకులను కంబోడియా పంపించాడు. మల్కాపురంనకు చెందిన పవన్ కూడా కంబోడియా జాబ్ స్కామ్ కంపెనీలో పని చేస్తూ అలీ ద్వారా కంబోడియాకు చేరవేశాడు. బాధితులంతా తిరిగి నగరానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో అలీని పోలీసులు అరెస్టు చేశారు. పవన్ కోసం ఎల్‌వోసీ జారీ చేశారు. ఇదే కేసులో బొంగు మురళీ అనే వ్యక్తి ఉండంతో ఆయనపై కూడా ఎల్‌వోసీ జారీ చేశారు.

5న పౌర సరఫరాల శాఖ ప్రాంతీయ సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పౌర సరఫరాల శాఖ ప్రాంతీయ సదస్సు (ఉత్తరాంధ్ర జిల్లాలు) ఈనెల ఐదో తేదీ ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. జూన్ నెల నుంచి రేషన్ డిపోల్లోనే బియ్యం పంపిణీ ప్రారంభమైన నేపథ్యంలో ఇబ్బందులు తెలుసుకుని మరింత మెరుగ్గా సరకులు అందించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై సదస్సులో చర్చించనున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారు. ఆయన ఈనెల మూడో తేదీ సాయంత్రానికి నగరానికి చేరుకుంటారు. నాలుగో తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనకు వెళ్లి, ఐదో తేదీ ఉదయం నగరానికి తిరిగి వస్తారు.

విత్తన రాఖీలనే వినియోగించండి

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) ప్రతిఒక్కరూ పర్యావరణ హితమైన రాఖీలను వినియోగించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ సైంటిస్టు శ్రీరంజని అన్నారు. శనివారం మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో మురళి మాధవ విద్యాలయం, శ్రీవిద్యావికాశ్ స్కూలు విద్యార్థులు దేశీయ విత్తనాలతో తయారు చేసిన రాఖీలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. పీసీబీ ఈఈ ముకుందరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. విత్తన రాఖీలు వినియోగించడం, చెట్లకు వృక్షాబంధనం చేయడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ పి. శ్రీనివాసరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, కో ఆర్డినేటరు రాజేశ్వరి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : దాకమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయ నున్నట్టు జోన్ త్రీ ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రఘు కళాశాల, ఎన్ఎస్ఆర్ ఐటీ కళాశాల, చాయిస్ కంపెనీ, ఎవరెస్టు కంపెనీ, తిరుపతి ప్లైవుడ్, ఎంబీఏ కళాశాల ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

బేకరీల్లోనూ అదే సీన్

... 5వ పేజీ తరువాయి

ఎస్ఎస్ఎన్ బేకరీ, ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద గల పేస్ట్రీ చెఫ్ షాపుల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కొన్నిచోట్ల రెండు, మూడేళ్ల కిందట గడువు తీరిన వస్తువులను కూడా వినియోగిస్తున్నారు. ఎస్ఎస్ఎన్ బేకరీలో ఇలాంటి రంగుల సీసాలను పది వరకూ సీజ్ చేశారు. దయారం స్వీట్స్‌లో ఫంగస్ పట్టి, పాడైన బాదంపప్పును గుర్తించారు. సుమారు 60 ప్యాకెట్లు ఇలా కనిపించాయి.ఈదుకాణంలో ఆహార పదార్థాల తయారీకి వినియో గించిన కొన్నిరకాల వస్తువుల గడువు కూడా ముగిసినట్టు గుర్తించారు. సీతమ్మధారలోని సాయిలక్ష్మీ స్వీట్స్, సీతంపేట అయ్యంగార్ బేకరీ, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చందు స్వీట్స్, కిసాన్ బేకరీలో నాణ్యత తక్కువగా ఉన్న బిస్కెట్లు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన బాదంపాలు విక్రయిస్తున్నారు.

గడువు తీరినా విక్రయాలు..

అనేక దుకాణాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్స్, కేక్స్, స్వీట్స్ తయారీకి వినియోగించే పదార్థాల గడువు తీరినట్టు అధికారుల తనిఖీల్లో తేలింది. అలాగే, ప్యాకేజీ నిబంధనల ప్రకారం వివరాలు లేని వస్తువులను గుర్తించారు. గడువు దాటి నెలలు, వారాలు గడిచిన ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు ఆయా దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ నిబంధనలు పాటించని షాపులపై 16 కేసులను అధికారులు నమోదుచేశారు. మొత్తం 39 రకాల పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీపీబీ నందాజీ, చక్రవర్తితోపాటు వివిధ శాఖలకు చెందిన 40 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

తనిఖీలు చేపట్టిన దుకాణాలివే...

అధికారులు తనిఖీలు నిర్వహించిన దుకాణాల్లో ప్రముఖ బేకరీ, స్వీట్ దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో కూడా అధ్వాన పరిస్థితులు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఫ్రెష్ చాయిస్, బేకరీ కేస్టలీ, మణికంఠ బేకరీ అండ్ స్వీట్స్ (బేకర్స్ డెన్), సిరిపురంలోని ఫుడ్ ఎక్స్ స్వీట్ ఇండియా, రామ్‌నగర్‌లోని లడ్డూ గోపాల్, శ్యామల డ్రై ఫ్రూట్స్, మద్దిలపాలెంలోని ఎస్ఎస్ఎన్ బేకరీ, క్రౌన్ బేకరీ, దయారం స్వీట్స్, శార్వాణీ స్వీట్స్, ఇసుకతోటలోని స్వగృహ స్వీట్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని చందు స్వీట్స్, ద్వారకానగర్‌లోని గృహప్రియ, మర్రిపాలెంలోని రెడ్‌వాల్వెట్, రైల్వే స్టేషన్ రోడ్డులోని బేకరీ ఎట్ మర్రిపాలెం, మర్రిపాలెంలోని అయ్యంగార్ బేకరీ, పేస్ట్రీ చెఫ్, పెందుర్తిలోని అంబికా స్వీట్స్, సాయిరామ్, సుజాతనగర్‌లోని గోదావరి, ఎన్ఏడీలోని చందు స్వీట్స్, రుచి, రెడ్ చెర్రీ బేకరీ, ఫోర్ సీజన్, ఫ్రెండ్ బేకరీ, మోహన్ స్వీట్స్, గృహ ప్రియ స్వీట్స్, శివరామ్ స్వీట్స్, బెంగళూరు అయ్యంగార్ బేకరీ, తగరపువలసలోని దేవి స్వీట్స్, మణికంఠ స్వీట్స్, పీఎంపాలెం డబుల్ రోడ్డులోని స్వీట్స్ షాప్ 1, 22, కొమ్మాదిలోని టీఎఫ్‌సీ బేకరీ, మిథులాపురి కాలనీలోని అయ్యంగార్ బేకరీ, మధురవాడలోని రెడ్ వాల్వెట్, బి ట్రీట్స్, ఎండాడలోని శ్యామల డ్రై ఫ్రూట్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఎన్నికల బరిలో 20 మంది

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 6న ఎన్నిక జరగనున్నది.

పోటీలో ఉన్న అభ్యర్థులు... (బ్రాకెట్‌లో వార్డు, పార్టీ)

1. గంకల కవిత (48, బీజేపీ), 2. దాడి వెంకట రామేశ్వరరావు (89, టీడీపీ), 3. సేనాపతి వసంత (97, టీడీపీ), 4. మొల్లి హేమలత (5, టీడీపీ), 5. మాదంశెట్టి చినతల్లి (84, టీడీపీ), 6. గేదెల లావణ్య (17, టీడీపీ), 7. రాపర్తి త్రివేణివరప్రసాదరావు (93, టీడీపీ), 8.రౌతు శ్రీనివాసరావు (79, టీడీపీ), 9.మొల్లి ముత్యాలు (88, టీడీపీ), 10. కొణతాల నీలిమ (80, టీడీపీ), 11. నక్కెళ్ల లక్ష్మి (20, వైసీపీ), 12. సాది పద్మారెడ్డి (24, వైసీపీ) 13. వల్లా అప్పలకొండ (28, వైసీపీ) 14. బిపిన్‌కుమార్‌జైన్ (31, వైసీపీ) 15. గుండపు నాగేశ్వరరావు (40, వైసీపీ), 16. కోడిగుడ్ల పూర్ణిమ (41; వైసీపీ), 17. రెయ్యి వెంకటరమణ (51, వైసీపీ), 18. కేవీఎన్ శశికళ (55, వైసీపీ), 19. మహ్మద్ ఇమ్రాన్ (66 వైసీపీ), 20. ఉరుకూటి రామచంద్రరావు (70, వైసీపీ).

బడుల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

నిధులతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆ నిధులు ఖర్చు చేయవద్దని ఇటీవల విద్యా శాఖ ఆదేశించింది. ఇదిలావుండగా గత వారం మనబడి-మన భవిష్యత్తు పనులకు ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయవచ్చునని అధికారులు భావించారు. జిల్లాలో 309 పాఠశాలల్లో పనులు పూర్తికావాలంటే రూ.30 కోట్లు అవసరమని విద్యా శాఖలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదిక రూపొందించారు. అయితే ఆ నిధులను రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన పలు రకాల మెటీరియల్ సరఫరా చేసే సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తికి ప్రత్యేకించి నిధులు మంజూరుచేసేంత వరకూ ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్తు, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడి వయసు 58 సంవత్సరాలలోపు ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీగా ఇదివరకు పనిచేసి ఉన్నవారు, క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలకు గురైనవారు అనర్హులు. దరఖాస్తుదారులు తమ బయోడేటాను ఈ నెల 5లోగా ప్రధానోపాధ్యాయుడి ద్వారా అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ లేదా సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదో వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కోసం పైపులైన్ల నిర్మాణానికి కార్పొరేటరు గొలగాని మంగమ్మ పోలరావు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షల జీవీఎంసీ నిధులతో వీటి నిర్మిస్తారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రామారావు, గురయ్య, పోతన, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హిరోషిమా సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అణ్వస్త్ర రహిత ప్రపంచాన్ని కోరుతూ హిరోషిమా, నాగసాకి సంస్మరణ వారాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుంచి 9 వరకు ఎపీఆర్‌ఎఫ్, బీబీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని పలు కళాశాలల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని అక్వాడెంట్స్ డిగ్రీ కళాశాలలో శనివారం గోడ పత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, డాక్టర్ అప్పారావు, డాక్టర్ బల్ల, హెన్సీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేస్తం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. సుమారు 8 సంవత్సరాల నుంచి ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. హనుమంతవాక జంక్షను సమీపంలో గల సంజీవని మెడికల్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడడానికి ఇది ఒక అవకాశమని వారు అన్నారు.

సినిమా గైడ్

● సార్, మేడమ్ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● కింగ్‌డమ్ : జగదాంబ
● సన్ ఆఫ్ సర్దార్ : రమాదేవి
● మహావతార్ నరసింహ : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లలిత (పెందుర్తి), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
● హరిహర వీరమల్లు : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (మార్కెట్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పెసి)10, మునక్కాడలు (కిలో) 40, ఆలు (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బఠానీలు 50, బీన్ కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, క్యాప్సికమ్ (పెద్దవి) 30, బీన్స్ (పెర్రిబీ) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దవి) 24, చేమదుంపలు 34, బీలగడుదుంపలు 44, కంద 42, డేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్డు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యానికి రక్షణ

నవజాత శిశు సంరక్షణ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని, పుట్టిన వెంటనే పిల్లలకు పాలివ్వడం అత్యంత కీలకమని కేజీహెచ్ నవజాత శిశు సంరక్షణ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోహలు, అనుమానాలతో నవజాత శిశువులకు తల్లిపాలు ఇవ్వడం మానకూడదన్నారు. తల్లిపాలతో చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఎదుగుదలకు అవసరమైన అనేక పోషకాలను అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెదజాలరిపేట అంగన్వాడీ కేంద్రంలో..

పెదవాల్తేరు : తల్లిపాలతో చిన్నారులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, పుట్టినప్పటి నుంచి కొన్ని నెలల పాటు తల్లిపాలు అందించాలని హెల్త్ ప్రాజెక్టు సమన్వయకర్త పద్మిని పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట అంగన్వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఇస్తే అన్ని పోషకాలు-విటమిన్- ప్రొటీన్లు లభిస్తాయని, పసి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని అన్నారు. పిల్లలకు భవిష్యత్తులో డయాబెటిస్, ఒబెసిటీ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలుసుకో

అమర్‌కు టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి సూచన



విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలియకుండా వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతున్నారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుడివాడ అమర్‌నాథ్ వారి మెంటర్కు ఎక్కువ. నర్సింహం తక్కువ అని వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో విశాఖలో ఒక్క ఐటీ కంపెనీ కూడా పెట్టలేదని, రాజధాని పేరుతో ఉన్నవి వెళ్లగొట్టారని ఆరోపించారు. వైసీపీ అరాచకాలను గ్రహించిన ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్న విషయం గుర్తు చేసుకోవాలన్నారు. అమర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ అన్నారు. చిన్న వయస్సులోనే కార్పొరేటర్‌గా చంద్రబాబునాయుడు సీటిచ్చిన విషయం మర్చిపోయి ఆయన్ను విమర్శిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించే స్థాయి అమర్‌కు లేదని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రిగా పరిశ్రమలు తీసుకురాలేదు సరికదా కోడి గుడ్డు మంత్రిగా రాష్ట్రానికి సుపరిచితమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో సీఎంగా జగన్ విదేశాలకు వెళ్లి ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని, తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. ఏదైనా పాలనలో తాము ఏమి చేశామో చెప్పడానికి బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

స్వలాభం కోసమే చంద్రబాబు పర్యటన

వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ ఆరోపణ

మద్దిలపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు కాదని, అక్కడ తన సొంత పెట్టుబడులు పెట్టడానికే వెళ్లారని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-19లో అమరావతిలో అభివృద్ధి పేరుతో సీ క్యాపిటల్ పేరుతో రూ.12 వేలకోట్ల విలువైన 1691 ఎకరాలను సింగపూర్ కంపెనీలకు దోచిపెట్టారని ఆరోపించారు.సింగపూర్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నగరంలో అత్యంత విలువైన 13.67 ఎకరాలను లులూ సంస్థకు కట్టబెట్టడం వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించారు. కిరణా సామాన్లు అమ్మే మాల్‌కు రూ.1,500 కోట్ల విలువైన భూమి కేటాయించడం ఏమిటన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

మద్దిలపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అన్నారు. కళాశాలలో శనివారం నిర్వహించిన సమాచారహక్కు చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ పరిపాలన పారదర్శకతకు సమాచార కోరడం పౌరులందరి హక్కు అన్నారు. అవసరమైన సమయంలో సమాచారం పొందడం ద్వారా ఈ హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం సభ్యవరం, బీబీలి, తగరపువలస, చోడవరం, ఎస్.కోట, కృష్ణ కళాశాల విద్యార్థులకు సమాచార హక్కు చట్టం-2005 అనే అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

వచ్చే నెలలో నర్సుల సంఘం సమావేశాలు

రామ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వచ్చే నెల 19, 20 తేదీల్లో శిక్షణ (ట్రైన్డ్) నర్సుల సంఘం 31వ రాష్ట్ర ద్వైవార్షిక సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం రామ్‌నగర్‌లోని రాడిసన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ లెర్నింగ్ టుడే లీడింగ్ టుమారో (నర్సింగ్ విద్యార్థి ప్రయాణం నేడు నేర్చుకొనుట రేపు నడిపించటం) అనే ప్రధాన అంశంగా సమావేశాలు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమం ప్రభుత్వ ప్రైవేటు నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో టీఎస్ఏఐ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్. సంఘీ బేగం, ప్రొఫెసర్ కె.సుశీల, డాక్టర్ ఎంసత్యవల్లి, డాక్టర్ డి.ఉషా, పన్నాగవేణి, ఎం.పీతం, లూక్ పాల్గొన్నారు.

అంకితభావంతో ఉన్నత స్థానాలు

బీచ్ రోడ్డు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో వృత్తిని నిర్వర్తిస్తే ఉన్నత స్థానం సాధ్యమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శనివారం బీచ్ రోడ్డు వద్ద ఉన్న ఆంబికా సీ గ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. టెక్ కాలింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు టెక్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యనందించడం, గల్ఫ్‌లో ఉద్యోగాలు కల్పించే ఏజెన్సీ ప్రారంభోత్సవం, విదేశీ విద్యలో యువతకు అవగాహన కల్పించడం, నౌకల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా ఓషియన్ రిక్రూట్ మెంట్ 4 విభాగాలను ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావునాయుడు, సయ్యద్ పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి ఆదర్శం వీవీ రామారావు

వెంకోజీపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వి.వి.రామారావు నాల్గో వర్ధంతి శనివారం ఇసుకతోటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గండికోట సతీష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు, కార్మికులు రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా వి.వి.రామారావు తుదిశ్వాస విడిచే వరకు కార్మికవర్గ హక్కులు కాపాడడంలో రాజీలేని పోరాటాలు నడిపారని కొనియాడారు. విశాఖపట్నం పోర్టు కార్మిక నాయకుడిగా జాతీయ పోర్టు కార్మిక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ ఏఐటీయూసీ జాతీయ నాయకుడిగా, పోర్టు, చిట్టివలస జ్యూట్‌మిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ తదితర పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి సమర్థవంతమైన నిస్వార్థ నాయకుడిగా సేవలు అందించడమే కాక అసంఘటిత రంగ కార్మికులను సమీకరించి అనేక ఉద్యమాలకు సారథ్యం వహించారని గుర్తుచేశారు. అనేక సమస్యల పరిష్కారంతో పాటు కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను కాపాడడంలోనూ, కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంలో కీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సతీష్, సాయిబాబా, నూకన్నారాయణ, నాగరాజు, శివారెడ్డి, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీల ఫోన్లను సీడీపీవోలకు ఇచ్చేస్తాం'

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):అంగన్వాడీల ఫోన్లను ఈనెల 4న సీడీపీవోలకు ఇచ్చేస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూజిల్లా కమిటీ తీర్మానించింది. ఈమేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, యాప్‌ల పనిభారం తగ్గించాలని, నెట్‌స్పీడ్‌గా వచ్చే సెల్ ఫోన్లు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, వేతనాలు పెంచాలని, చట్టం ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా, స్పందించకపోవడం వల్ల ఫోన్లు తిరిగి ఇచ్చేసి, కేవలం రాష్ట్ర వర్కు మాత్రమే చేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు.



పీడీకి వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

'ఆధారాలు లేని విమర్శలు మానుకోవాలి'

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రయత్నిస్తుంటే మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. ఉర్సా సంస్థకు 99 పైసలకే భూమి కేటాయించినట్టు తగిన ఆధారాలు ఉంటే తీసుకురావాలని, దానిపై చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. ఆగస్టు 8న రుషికొండ వేదికగా కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో జరిగే అభివృద్ధి, గత ప్రభుత్వంలో వచ్చిన పెట్టుబడులపై చర్చకు సిద్ధమన్నారు. అలానే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రకు మీరు చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉపాధి అంశాలపై చర్చ పెడదామన్నారు.ఇప్పటికే విశాఖలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని తద్వారా అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పార్క్‌హయత్ సెంటర్‌కు, పరిశ్రమకు తేడా తెలియకుండా మంత్రిగా చేసిన అమర్‌నాథ్ పెట్టుబడులు, పరిశ్రమల కోసం మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర పరిశీలకులు చందోలు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిత ప్రవేశపెట్టిన కామన్ సీనియారిటీని తెలంగాణలో తొక్కుతూ ఎంఈఓ, 1గా కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే నియమించడం అన్యాయమన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల పట్ల వివక్ష తగదని పేర్కొన్నారు. తక్షణమే అపరిష్కృత సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 12న రాష్ట్రస్థాయిలో నిరసన ప్రదర్శన చేపడతామని హెచ్చరించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకుందాం

వామపక్షాల పిలుపు



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు భారమైన విద్యుత్ ప్రీపెయిడ్ (స్మార్ట్) మీటర్ల బిగింపును తక్షణమే నిలిపివేయాలని వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది.ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. మణి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు గృహ వినియోగదారులకు బిగిస్తే వారిపై మరింత విద్యుత్ భారం పడుతుందన్నారు.ప్రస్తుత విధానం అనుకూలంగా ఉన్నప్పుడు అదాని స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల తయారీపై అదానీతో ఒప్పందం కుదుర్చుకుంటోందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రస్తుత మంత్రి లోకేశ్ పాదయాత్ర సందర్భంగా పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటినే బిగించడం దుర్మార్గ చర్య అని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు డిమాండ్ చేస్తూ ఈనెల 5న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని కోరారు. సీపీఐ ఆరిలోవ ఏరియా కార్యదర్శి లక్ష్మణరావు, సీటు మద్దిలపాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేంద్రకుమార్, కాసుబాబు, శంకర్, పౌరహక్కుల సమాఖ్య నాయకులు దేవుడమ్మ, ఐద్వా నాయకురాలు రవణమ్మ, రత్నం పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి యువకుడి మృతి

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో బైక్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందాడు. శ్రీకృష్ణాపురం గ్రామానికి చెందిన ముంజేటి జయంత్, హరీష్ శనివారం తెల్లవారుజామున పైనాపిల్ కాలనీ నుంచి బైక్‌పై వస్తుండగా ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. బైక్ వెనుక కూర్చున్న జయంత్ తలకు తీవ్ర గాయం కాగా, హరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా జయంత్ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మృతి చెందినట్టు అతని తండ్రి రాము ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఎంవీపీ కాలనీ,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తపాలా శాఖ 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనుంది. ఈనెల 5, 11 తేదీల్లో 'అందమైన విశాఖపట్నం' అన్న అంశంపై పోటీలు నిర్వహిస్తారు. అలాగే 6, 12 తేదీల్లో పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్లపై ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు 'విశాఖపట్నం నగరాన్ని ఇంకా అందమైన, అభివృద్ధి నగరంగా ఎలా మార్చాలి' అన్న అంశానికి సంబంధించి కలెక్టరుకు లేఖ రాయాలి. అలాగే 8, 9, 10 తరగతుల విద్యార్థులు 'విశాఖపట్నం నగరాన్ని పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఎలా మార్చాలి' అన్న అంశంపై కలెక్టరుకు లేఖ రాయాలి. ఆయా తేదీల్లో జగదాంబ కూడలి వద్దనున్న సెయింట్ ఆంథోనీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పోటీ నిర్వహిస్తారు. పేర్ల నమోదుకు, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 90789 79079, 97030 34001 సంప్రదించాలని జిల్లా తపాలా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

నాటక రంగానికి వన్నె తెచ్చిన బళ్లారి రాఘవ

వెంకోజీపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సమాజ ఉద్ధరణకు, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నాటకరంగం ద్వారా బళ్లారి రాఘవ విశేష కృషి చేశారని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు బళ్లారి రాఘవ చిత్రపటానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ ఇతర అధికారులతో కలిసి మేయర్ శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ బళ్లారి రాఘవ క్రిమినల్ కేసులు వాదించడంలో ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించి రావు బహదూర్ బిరుదు ఇచ్చిందన్నారు. తన సంపదను, సమయాన్ని నాటక రంగ పురోగతికి వెచ్చించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీహెచ్ దామోదరరావు, జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, బయాలజిస్టు సాంబమూర్తి, పాల్గొన్నారు.

'ఎంవీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి'

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దళిత అధికారిణి విద్యుల్లతపై అనుచిత వ్యాఖ్యలు చేసి, అవమానించిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై ప్రభుత్వం అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విరసం కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఇటీవల అమరావతి సెక్రెటేరియట్‌లో మున్సిపల్ విభాగంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లతపై అనుచిత వ్యాఖ్యలు, బెదిరించడంపై ఆయన స్పందిస్తూ దళిత అధికారిణి పట్ల మాజీ ఎంపీ ఎంవీవీ చేసిన వ్యాఖ్యలలో అహంకారం ఉందని పేర్కొన్నారు.

నక్కవానిపాలెంలో తొలగిన చీకట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలో విద్యుత్ దీపాల సమస్యను అధికారులు పరిష్కరించారు. 'నక్కవానిపాలెంలో అంధకారం' శీర్షికతో ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు స్పందించిన జీవీఎంసీ విద్యుత్ మరమ్మతుల విభాగం శనివారం హైటెన్షన్ పవర్ లైన్‌కు దగ్గర ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. హైటెన్షన్ విద్యుత్ తీగలు దగ్గరగా ఉండటం వల్ల బల్బులు ఎప్పటికప్పుడు కాలిపోతున్నట్లు ఫిర్యాదులు అందడంతో స్తంభాన్ని తొలగించారు. ఆ ప్రాంతంలో చీకటి లేకుండా బల్బులు అమర్చినట్లు జీవీఎంసీ విద్యుత్ మరమ్మతుల విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ విక్రంత్ వర్మ తెలిపారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలకు పాల్పడితే బంగారు భవిష్యత్తు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ శ్రీనివాసరావు

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలని కంచరపాలెం ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీనివాసరావు హితవు పలికారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై ఆర్పీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి అలవాట్లు ఉన్నవారితో స్నేహం చేయరాదన్నారు. ర్యాగింగ్‌తో ఇతరులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. ట్రాఫిక్ నియమాలు వివరించి అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. హెచ్‌ఎం ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయురాలికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై ఒంటరిగా పడుకొని ఉన్న గౌరీ (50)ని మహారాణిపేట పోలీస్ స్టేషన్ ఎస్సై లక్ష్మి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. విశాఖ జిల్లాలోని దల్లివాడి పాలెం ప్రాంతానికి చెందిన గౌరిని ఆమె భర్త పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి రోడ్లపై ఒంటరిగా తిరుగుతోంది. దీంతో గౌరికి ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని చెప్పారు.

ఆరోగ్యంపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న దుర్గా కళ్యాణి

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జగతి ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా కళ్యాణి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు శనివారం రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. రుతుచక్రంలో మార్పులను వివరించారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, మార్పులు సహజమన్నారు. అనంతరం విద్యార్థినులకు రుతు రుమాళ్లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టరు అనురాధ, డా.ఎస్.ప్రశాంతకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి: సీపీఎం



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న సీపీఎం నాయకులు

అల్లిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం వేయడం బాధాకరమని సీపీఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం. సుబ్బారావు అన్నారు. శనివారం అల్లిపురం చలువతోటలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.రాజు, సి.హెచ్ చంద్రమౌళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిత కోసం కూటమి ప్రభుత్వాన్నే ఆదరించండి

- రాక్షస వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపిన ప్రజల రుణం తీర్చుకోలేనిది
- 48వ వార్డులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ఇందిరానగర్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడిన ప్రజలకు ఏమిచ్చినా రుణం తీరదని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. జీవీఎంసీ 48వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శనివారం ప్రారంభించారు. కొండవాలు గ్రామాలకు మేలుకలిగించేలా బాపూజీ నగర్‌లో రూ.3 కోట్లతో కల్యాణమండపం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ 48వ వార్డు అభివృద్ధి చెందుతోందన్నారు. కౌన్సిల్‌లో పోరాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువచేస్తున్న కార్పొరేటర్ గంకల కవితను ఎమ్మెల్యే అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పగ్గాలు చేపట్టాక ప్రజలకు భరోసా ఏర్పడిందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికే తమ మద్దతు కొనసాగించి బంగారు భవితకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇందిరానగర్-3, 5 గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంకల అప్పారావు, శ్యామలాదీపిక, జడ్పీ రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దిలీప్, ఏఈ సాయినాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యానవనం అభివృద్ధికి భూమిపూజ

మురళీనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు తెన్నేటినగర్‌లో శనివారం తెన్నేటి విశ్వనాథం ఉద్యానవనం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు భూమిపూజ చేశారు. నిరాదరణకు గురైన పార్కు కనీస వసతులు లేకుండా మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానికులు చేసుకున్న విన్నపాల మేరకు పనుల ప్రారంభానికి మోక్షం లభించింది. దాదాపు రూ.1.19 కోట్లతో పార్కు నవీకరణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్పొరేటర్ వి.ప్రసాద్, జెడ్పీ బి.రాము, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, సునీల్, 50వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కె.వెంకట్, టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

149 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న స్వామివివేకానంద సంస్థ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి సందర్భంగా వన్‌టౌన్‌లోని స్వామి వివేకానంద సంస్థ శనివారం 149 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించింది. స్వామి వివేకానంద సంస్థ కార్యాలయం నుంచి విక్టోరియా రాణి విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. సంస్థ గౌరవాధ్యక్షుడు సీఎంఏ జహీర్ అహ్మద్ ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 1921లో భారత జాతీయ పతాకాన్ని రూపొందించారన్నారు. ఏటా ఆగస్టు 2న ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింగళి వెంకయ్య విగ్రహాలను అసెంబ్లీ, పార్లమెంట్ ఆవరణలో ఆవిష్కరించాలని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు టి.కృష్ణ, సీహెచ్ నూకరాజు, బాషా, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. తొలుత సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య చిత్రపటానికి డాక్టర్ జహీర్ అహ్మద్ పూలమాలవేసి నివాళులర్పించారు.

మొక్కలకు ఫ్రెండ్లీ బ్యాండ్లు



మొక్కకు బ్యాండ్లు కడుతున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలుగా ఎదగకముందు మొలకెత్తే విత్తనాల మాదిరి స్నేహాలు వికసిస్తాయని రోటరీ క్లబ్ వైజాగ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ అన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మొక్కలకు స్నేహ బ్యాండ్లను విద్యార్థులు కట్టారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటి, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు లక్ష్మీదేవి, డాక్టర్ బాలాజీ, సంతోష్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పనులు.. ప్రజల అవస్థలు



నక్కవానిపాలెంలో తవ్వి వదిలేసిన గోతులు



తవ్వితీసిన మట్టిని చదును చేయని దృశ్యం

మర్రిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెంలోని శివనగర్‌లో భూగర్భ మురుగు కాలువ (యూజీడీ) పనుల నిమిత్తం కాలనీ ప్రధాన రహదారిని సంబంధిత సిబ్బంది తవ్వారు. ఆ పనులు పూర్తయిన అనంతరం రోడ్డును యథావిధిగా కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురాకుండా రోడ్డును తవ్విన మట్టితో గోతులు కప్పేసి రాకపోకలకు అవకాశం లేకుండా అస్తవ్యస్తంగా వదిలేశారు. రోడ్డుపై వేసిన మట్టికుప్పలను తొలగించకపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పనులు పూర్తి చేసి సుమారు 15 రోజులు గడిచినా సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో రాత్రి సమయాల్లో వృద్ధులు,



అసంపూర్తిగా వదిలేసిన శివనగర్ కాలనీ ప్రధాన రహదారి

చిన్నపిల్లలు ఆ రహదారి నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీడీ పనుల కోసం తీసుకు వచ్చిన నిర్మాణ సామగ్రిని ప్రధాన రోడ్డుపైన వదిలేయడంతో వాహనదారులు రాత్రివేళల్లో గమనించలేక అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన శివనగర్ కాలనీ ప్రధాన రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి తమను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

తవ్వి వదిలేయడమేనా పని?

సీతమ్మధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ), అమృత మంచినీటి పైపులైన్ల నిమిత్తం రోడ్లు తవ్వి గోతులు పూడ్చకుండా వదిలేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనాలపై వెళ్లి రావడం సాహస ప్రయాణంగా మారింది. రోడ్లు తవ్వి రోజులు గడుస్తున్నా గోతులు కప్పకుండా అలానే వదిలేశారు. వర్షం కురిసినప్పుడు ఆ గోతులు వాన నీటితో నిండిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో వాహనాల టైర్లు కూరుకుపోతున్నాయి. రోడ్లు తవ్వించిన కాంట్రాక్టర్లు తమకు పట్టదన్నట్లు వదిలి వేస్తున్నారు. "యూజీడీ పనులు చేపట్టే వరకే మా వంతు, అమృత నీటి పైపులైన్లు వేసేంతవరకే మా పనులు.. రోడ్లు వేయడం మా పని కాద'ని కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. నక్కవానిపాలెం ప్రధాన రహదారి, ఏఎంజీ ఆసుపత్రి రోడ్డు, వెనుక రోడ్డు, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో జయభేరి నుంచి సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో గోతుల సమస్య నెలకొంది. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్మీడియట్‌లో పెరిగిన ప్రవేశాలు



కళాశాల తరగతి గదిలో నిండుగా విద్యార్థినులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 831 మంది విద్యార్థినులు ప్రవేశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ తెలిపారు. నిరుటికంటే ఈ ఏడాది ఈ సంఖ్య పెరిగిందన్నారు.ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి విద్యార్థినులు 1,470 మంది కళాశాలలో చదువుతున్నారన్నారు. మార్చి 2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలో తమ కళాశాల మొదటిస్థానంలో నిలిచిందన్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈపీడీసీఎల్ అధికారులు 'రేషనలైజేషన్' పేరుతో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎవరైతే అడ్డగోలుగా ఇంక్రిమెంట్లు, పదోన్నతులు తీసుకున్నారో జాబితా రూపొందించి, వారికి అర్హతల ప్రకారమే జూలై నెల జీతాలు ఇచ్చారు. ఇకపై అవే జీతాలు ఇస్తామని స్పష్టంచేశారు. సగటున ఒక్కొక్కరికి రూ.15 వేలు తగ్గిపోయింది. ఇప్పటివరకూ అడ్డగోలుగా, అదనంగా తీసుకున్న జీతాలను ఎలా రికవరీ చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 ఓపెన్, బాలికల చదరంగం పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు శనివారం ముగిశాయి. సమత డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరీలో తనీష్, రమన్ సిద్ధార్థ్, వెంపర్ల వెంకటేశ్వరరావు, వరుణ్‌రాజ్ తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో మధుపడ మనస్వి, శ్రీనందన దత్తు, హేబా షరీన్, సాయి దీప్తి శివకోటి తొలి నాలుగు స్థానాలు సాధించారు. వీరు ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి ఓపెన్, బాలికల చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సమత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు డాక్టర్ బాబురావు, ఎస్.మణికంఠరావు, సునీల్ కుమార్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

బహుభాషా జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ షైజీ తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి అంశంపై ద్వితీయ భాషా విభాగఅధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ భాషలలో 55 మంది అధ్యాపకులు రచించిన వ్యాసాలతో రూపొందించిన 'బహుళ శోధ్ మంజూష' పేరుతో ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.దీప్తి, డా.నిర్మల, డా.కోటేశ్వరరావు, డా.రోజినా, డా.సుధాప్రియ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అందరిలో స్పృహ పెరిగింది: జి.ఎస్.ఎన్.రాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

మాధవధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణపై మరింత స్పృహ పెరగాలని ఏయూ మాజీ వీసీ, సెంచూరియన్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు సూచించారు. వాకర్స్‌క్లబ్‌లు ఈ దిశగా మంచి అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తున్నాయని అభినందించారు. శనివారం రాత్రి మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కరోనా తర్వాత ఆరోగ్య స్పృహ పెరిగిందన్న ఆయన, ఆహారపు అలవాట్లు, వ్యాయామ అవసరాల్ని గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకూడని సూచించారు. అనంతరం 'వాకర్స్ వాయిస్' పేరిట క్లబ్ వెలువరించే నెలవారీ సంచికను ఆవిష్కరించారు. వాకర్స్‌క్లబ్ మురళీనగర్ ప్రెసిడెంట్ ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వాకర్స్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్వీ.ప్రసాద్, పూర్వ అధ్యక్షులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేకరీల్లోనూ అదే సీన్

... 5వ పేజీ తరువాయి

ఎస్ఎస్ఎన్ బేకరీ, ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద గల పేస్ట్రీ చెఫ్ షాపుల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కొన్నిచోట్ల రెండు, మూడేళ్ల కిందట గడువు తీరిన వస్తువులను కూడా వినియోగిస్తున్నారు. ఎస్ఎస్ఎన్ బేకరీలో ఇలాంటి రంగుల సీసాలను పది వరకూ సీజ్ చేశారు. దయారం స్వీట్స్‌లో ఫంగస్ పట్టి, పాడైన బాదంపప్పును గుర్తించారు. సుమారు 60 ప్యాకెట్లు ఇలా కనిపించాయి. ఈ దుకాణంలో ఆహార పదార్థాల తయారీకి వినియోగించిన కొన్నిరకాల వస్తువుల గడువు కూడా ముగిసినట్టు గుర్తించారు. సీతమ్మధారలోని సాయిలక్ష్మీ స్వీట్స్, సీతంపేట అయ్యంగార్ బేకరీ, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చందు స్వీట్స్, కిసాన్ బేకరీలో నాణ్యత తక్కువగా ఉన్న బిస్కెట్లు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన బాదంపాలు విక్రయిస్తున్నారు.

గడువు తీరినా విక్రయాలు..

అనేక దుకాణాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్స్, కేక్స్, స్వీట్స్ తయారీకి వినియోగించే పదార్థాల గడువు తీరినట్టు అధికారుల తనిఖీల్లో తేలింది. అలాగే, ప్యాకేజీ నిబంధనల ప్రకారం వివరాలు లేని వస్తువులను గుర్తించారు. గడువు దాటి నెలలు, వారాలు గడిచిన ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు ఆయా దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ నిబంధనలు పాటించని షాపులపై 16 కేసులను అధికారులు నమోదుచేశారు. మొత్తం 39 రకాల పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీఏబీ నందాజీ, చక్రవర్తితోపాటు వివిధ శాఖలకు చెందిన 40 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

తనిఖీలు చేపట్టిన దుకాణాలివే...

అధికారులు తనిఖీలు నిర్వహించిన దుకాణాల్లో ప్రముఖ బేకరీ, స్వీట్ దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో కూడా అధ్వాన పరిస్థితులు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఫ్రెష్ చాయిస్, బేకరీ కేస్టలీ, మణికంఠ బేకరీ అండ్ స్వీట్స్ (బేకర్స్ డెన్), సిరిపురంలోని ఫుడ్ ఎక్స్ స్వీట్ ఇండియా, రామ్‌నగర్‌లోని లడ్డూ గోపాల్, శ్యామల డ్రై ఫ్రూట్స్, మద్దిలపాలెంలోని ఎస్ఎస్ఎన్ బేకరీ, క్రౌన్ బేకరీ, దయారం స్వీట్స్, శార్వాణీ స్వీట్స్, ఇసుకతోటలోని స్వగృహ స్వీట్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని చందు స్వీట్స్, ద్వారకానగర్‌లోని గృహప్రియ, మర్రిపాలెంలోని రెడ్‌వాల్వెట్, రైల్వే స్టేషన్ రోడ్డులోని బేకరీ ఎట్ మర్రిపాలెం, మర్రిపాలెంలోని అయ్యంగార్ బేకరీ, పేస్ట్రీ చెఫ్, పెందుర్తిలోని అంబికా స్వీట్స్, సాయిరామ్, సుజాతనగర్‌లోని గోదావరి, ఎన్ఏడీలోని చందు స్వీట్స్, రుచి, రెడ్ చెర్రీ బేకరీ, ఫోర్ సీజన్, ఫ్రెండ్ బేకరీ, మోహన్ స్వీట్స్, గృహ ప్రియ స్వీట్స్, శివరామ్ స్వీట్స్, బెంగళూరు అయ్యంగార్ బేకరీ, తగరపువలసలోని దేవి స్వీట్స్, మణికంఠ స్వీట్స్, పీఎంపాలెం డబుల్ రోడ్డులోని స్వీట్స్ షాప్ 1, 22, కొమ్మాదిలోని టీఎఫ్‌సీ బేకరీ, మిధులాపురి కాలనీలోని అయ్యంగార్ బేకరీ, మధురవాడలోని రెడ్ వాల్వెట్, బి ట్రీట్స్, ఎండాడలోని శ్యామల డ్రై ఫ్రూట్స్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల ఆరో తేదీన ఎన్నిక జరగనున్నది.

పోటీలో ఉన్న అభ్యర్థులు... (బ్రాకెట్‌లో వార్డు, పార్టీ)

1. గంకల కవిత (48, బీజేపీ), 2. దాడి వెంకట రామేశ్వరరావు (89, టీడీపీ), 3. సేనాపతి వసంత (97, టీడీపీ), 4. మొల్లి హేమలత (5, టీడీపీ), 5. మాదంశెట్టి చినతల్లి (84, టీడీపీ), 6. గేదెల లావణ్య (17, టీడీపీ), 7. రాపర్తి త్రివేణివరప్రసాదరావు (93, టీడీపీ), 8.రౌతు శ్రీనివాసరావు (79, టీడీపీ), 9.మొల్లి ముత్యాలు (88, టీడీపీ), 10. కొణతాల నీలిమ (80, టీడీపీ), 11. నక్కెళ్ల లక్ష్మి (20, వైసీపీ), 12. సాది పద్మారెడ్డి (24, వైసీపీ) 13. పల్లా అప్పలకొండ (28, వైసీపీ) 14. బిపిన్‌కుమార్‌జైన్ (31, వైసీపీ) 15. గుండపు నాగేశ్వరరావు (40, వైసీపీ), 16. కోడిగుడ్ల పూర్ణిమ (41; వైసీపీ), 17. రెయ్యి వెంకటరమణ (51, వైసీపీ), 18. కేవీఎన్ శశికళ (55, వైసీపీ), 19. మహ్మద్ ఇమ్రాన్ (66 వైసీపీ), 20. ఉరుకూటి రామచంద్రరావు (70, వైసీపీ).

బడుల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

నిధులతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆ నిధులు ఖర్చు చేయవద్దని ఇటీవల విద్యా శాఖ ఆదేశించింది. ఇదిలావుండగా గత వారం మనబడి-మన భవిష్యత్తు పనులకు ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయవచ్చునని అధికారులు భావించారు. 309 పాఠశాలల్లో పనులు పూర్తికావాలంటే రూ.30 కోట్లు అవసరమని విద్యా శాఖలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదిక రూపొందించారు. అయితే ఆ నిధులను రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన పలు రకాల మెటీరియల్ సరఫరా చేసే సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తికి ప్రత్యేకించి నిధులు మంజూరుచేసేంత వరకూ ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ఏయూ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కోర్సుల్లో చేరిన విద్యార్థుల ఈక్వెలెన్స్ (రాష్ట్రానికి చెందిన ఇంటర్మీడియట్ బోర్డుతో సమానంగా గుర్తించేలా) సర్టిఫికెట్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను యూనివర్సిటీకి పంపించాలని ఆదేశించారు. ఆయా విద్యార్థులు ఈ రెండు సర్టిఫికెట్లను ఈ నెల 20వ తేదీలోగా వర్సిటీకి అందించాలని, వాటిని సరిచూసిన తరువాతే సదరు విద్యార్థుల ఫలితాలను వెలువరిస్తామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో ఫేక్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థుల లెక్క తేలుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా చర్యలు ద్వారా భవిష్యత్తులో ఈ తరహా ప్రవేశాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

'ది డెక్'లో రైల్వే జోన్ కార్యాలయం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వెంటనే కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. దాంతో బోర్డు అధికారులు విశాఖ నుంచి వెళ్లిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అప్‌సెట్ ధర అంటే చ.అ. రూ.70 చొప్పున ఇవ్వడానికి వీఎంఆర్‌డీఏ అంగీకరించింది.

వారం రోజుల్లో ఎంఓయూ: శ్రీభరత్

ది డెక్‌లో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వారం రోజుల్లో వీఎంఆర్‌డీఏ, రైల్వే మధ్య ఎంఓయూ జరుగుతుందని, ఆ తరువాత ఇంటీరియర్ పనులు ప్రారంభించి కార్యాలయం ప్రారంభిస్తారని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జోన్ గెజిట్ నోటిఫికేషన్, జోన్ ఆపరేషన్ తేదీ కూడా త్వరలోనే వస్తుందన్నారు.

డ్వాక్రా దుకాణాలకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

లాటరీ తీసి కేటాయించాలని నిర్ణయించారు.

తెర వెనుక లాబీయింగ్

రైతుబజార్లలో వ్యాపారానికి, అక్కడి లాభాలకు అలవాటుపడిన డ్వాక్రా గ్రూపులు మళ్లీ మళ్లీ దుకాణాలు దక్కించుకోవాలని యత్నిస్తున్నాయి. అందుకని అదే గ్రూపులో వేరే సభ్యుల పేరుతో దరఖాస్తులు సమర్పించారు. మరికొందరు వేరే గ్రూపులో చేరి ఆ పేరుతో దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించే బాధ్యత సిటీలో మెప్మాకు, జిల్లాలో డీఆర్‌డీఏకు అప్పగించారు. దాంతో పాటు గోపాలపట్నంలోని మార్కెటింగ్ శాఖాధికారులు కూడా పరిశీలిస్తున్నారు. కొత్త గ్రూపులకు అవకాశం ఇవ్వాలనేది ప్రభుత్వం ఆలోచన. కానీ ఎలాగైనా మళ్లీ దక్కించుకోవాలని కొన్ని డ్వాక్రా గ్రూపులు యత్నిస్తున్నాయి. దాంతో ఎమ్మెల్యేలు, వారి దగ్గర వ్యక్తిగత సహాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇందుకోసం వారు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకూ ముట్ట జెబుతున్నారు. ఈ మొత్తాలను కొందరు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద తీసుకొని మరీ ఇస్తున్నారు. దుకాణం వస్తే ఆ వ్యాపారుల దగ్గరే అన్నీ కొనాలనేది ఒప్పందం. ఈ నేపథ్యంలో జిల్లాలో ఒక్కో ఎమ్మెల్యే పదేసి గ్రూపుల పేర్లు సిఫారసు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు ఎమ్మెల్యేలు అయితే తమ వారికి ఫలానా బజారులోనే దుకాణం ఇవ్వాలని ఒత్తిడి పెడుతున్నారు. ఇన్ని సిఫారసుల మధ్య లాటరీ పారదర్శకంగా జరిగే అవకాశం లేదు. గతంలో కూడా మార్కెటింగ్ శాఖలో ఓ అధికారి చక్రం తిప్పి వారి మనుషులకు ప్రధాన బజార్లలో దుకాణాలు ఇప్పించుకున్నారు. అప్పుడు కూడా లాటరీయే తీశారు కానీ వారికి అవసరమైనవి దక్కించుకున్నారు. ఆ అధికారి ఇప్పుడు లేకపోయినా మళ్లీ అదే తంతు నడిపించాలని కొందరు యత్నిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఈ విషయంలో ఎవరినీ విశ్వసించకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా లాటరీ తీయాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్తు, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడి వయసు 58 సంవత్సరాల లోపు ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీగా ఇదివరకు పనిచేసి ఉన్నవారు, క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలకు గురైనవారు అనర్హులు. దరఖాస్తుదారులు తమ బయోడేటాను ఈ నెల 5లోగా ప్రధానోపాధ్యాయుడి ద్వారా అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ లేదా సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, లేదా ఉపవిద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదో వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కోసం పైపులైన్ల నిర్మాణానికి కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షల జీవీఎంసీ నిధులతో వీటి నిర్మిస్తారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రామారావు, గురయ్య, పోతన, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హిరోషిమా సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అణ్వస్త్ర రహిత ప్రపంచాన్ని కోరుతూ హీరోషిమా, నాగసాకి సంస్మరణ వారాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుంచి 9 వరకూ ఐఏఆర్ఎఫ్, బీబీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని పలు కళాశాలల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నరవ ప్రకాశరావు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాలలో శనివారం గోడ పత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, డాక్టర్ అప్పారావు, డాక్టర్ బాబ్జి, హుస్సేన్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేస్తం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. సుమారు 8 సంవత్సరాల నుంచి ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. హనుమంతవాక జంక్షను సమీపంలో గల సంజీవిని మెడికల్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడడానికి ఇది ఒక అవకాశమని వారు అన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యానికి రక్షణ

నవజాత శిశు సంరక్షణ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని, పుట్టిన వెంటనే పిల్లలకు పాలివ్వడం అత్యంత కీలకమని ఘోషా స్త్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోహలు, అనుమానాలతో నవజాత శిశువులకు తల్లిపాలు ఇవ్వడం మానకూడదన్నారు. తల్లిపాలతో చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఎదుగదలకు అవసరమైన అనేక పోషకాలను అందించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్ర మంలో నర్సింగ్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెదజాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో..

పెదవాల్తేరు : తల్లిపాలతో చిన్నారులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, పుట్టినప్పటి నుంచి కొన్ని నెలల పాటు తల్లిపాలు అందించాలని హెల్త్ ప్రాజెక్టు సమన్వయకర్త షర్మిల పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెం టల్ హెల్త్ ప్రాజెక్ట్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఇస్తే అన్ని పోషకాలూ-విటమిన్- ప్రొటీన్లు లభిస్తాయని, పసి పిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని అన్నారు. పిల్లలకు భవిష్యత్తులో డయాబెటిస్, ఒబెసిటీ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలుసుకో

అమర్‌కు టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి సూచన



విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలియకుండా వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతున్నారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుడివాడ అమర్‌నాథ్ వార్డు మెంబర్‌కు ఎక్కువ.. సర్పంచ్‌కు తక్కువ అని వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో విశాఖలో ఒక్క ఐటీ కంపెనీ కూడా పెట్టలేదని, రాజధాని పేరుతో ఉన్నవి వెళ్లగొట్టారని ఆరోపించారు. వైసీపీ అరాచకాలను గ్రహించిన ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్న విషయం గుర్తు చేసుకోవాలన్నారు. అమర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే టీడీపీ అన్నారు. చిన్న వయస్సులోనే కార్పొరేటర్‌గా చంద్రబాబునాయుడు సీటిచ్చిన విషయం మర్చిపోయి ఆయన్ను విమర్శిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించే స్థాయి అమర్‌కు లేదని చెప్పారు. పరిశ్రమల శాఖా మంత్రిగా పరిశ్రమలు తీసుకురాలేదు సరికదా కోడి గుడ్డు మంత్రిగా రాష్ట్రానికి సుపరిచితమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో సీఎంగా జగన్ విదేశాలకు వెళ్లి ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని, తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. ఏడాది పాలనలో తాము ఏమి చేశామో చెప్పడానికి బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

స్వలాభం కోసమే చంద్రబాబు పర్యటన

వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ ఆరోపణ

మద్దిలపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు కాదని, అక్కడ తన సొంత పెట్టుబడులు పెట్టడానికే వెళ్లారని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014-19లో అమరావతిలో అభివృద్ధి పేరుతో సీ క్యాపిటల్ పేరుతో రూ.12 వేలకోట్ల విలువైన 1691 ఎకరాలను సింగపూర్ కంపెనీలకు దోచిపెట్టారని ఆరోపించారు.సింగపూర్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నగరంలో అత్యంత విలువైన 13.67 ఎకరాలను లులూ సంస్థకు కట్టబెట్టడం వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించారు. కిరాణా సామాన్లు అమ్మే మాల్‌కు రూ.1,500 కోట్ల విలువైన భూమి కేటాయించడం ఏమిటన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

మద్దిలపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అన్నారు. కళాశాలలో శనివారం నిర్వహించిన సమాచారహక్కు చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ పరమైన అంశాల్లో సమాచారం కోరడం పౌరులందరి హక్కు అన్నారు. అవసరమైన సమయంలో సమాచారం పొందడం ద్వారా ఈ హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం సబ్బవరం, భీమిలి, తగరపువలస, చోడవరం, ఎస్.కోట, కృష్ణ కళాశాల విద్యార్థులకు సమాచార హక్కు చట్టం-2005 అనే అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

వచ్చే నెలలో నర్సుల సంఘం సమావేశాలు

రామ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వచ్చే నెల 19, 20 తేదీల్లో శిక్షణ (ట్రైన్డ్) నర్సుల సంఘం 31వ రాష్ట్ర ద్వైవార్షిక సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం రామ్‌నగర్‌లోని రాక్‌డేల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ లెర్నింగ్ టుడే లీడింగ్ టుమారో (నర్సింగ్ విద్యార్థి ప్రయాణం నేడు నేర్చుకొనుట రేపు నడిపించటం) అనే ప్రధాన అంశంగా సమావేశాలను బీచ్ రోడ్డులోని ఏయూ కాన్వొకేషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో టీఎన్ఏఐ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్. సంషేర్ బేగం, ప్రొఫెసర్ కె.సుశీల, డాక్టర్ ఎం.సత్యవల్లి, డాక్టర్ డి.ఉషా, పన్నాగవేణి, ఎం.పీతం, లూక్ పాల్గొన్నారు.

అంకితభావంతో ఉన్నత స్థానాలు

బీచ్ రోడ్డు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో వృత్తిని నిర్వర్తిస్తే ఉన్నత స్థానం సాధ్యమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు న్నారు. శనివారం బీచ్ రోడ్డు వద్ద ఉన్న అంబికా సీ గ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. క్రూజ్ కాలినరీ అకాడమీ వ్యవస్థాపకుడు టేక్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యనందించడం, గల్ఫ్‌లో ఉద్యోగాలు కల్పించే ఏజెన్సీ ప్రారంభోత్సవం, విదేశీ విద్యలో యువతకు అవగాహన కల్పించడం, నౌకల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా ఓషియన్ రిక్రూట్‌మెంట్ 4 విభాగాలను ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు,నాజియా, సయ్యద్ పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి ఆదర్శం వీవీ రామారావు

వెంకోజీపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వి.వి.రామారావు నాలుగో వర్ధంతి శనివారం ఇసుకతోటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గండిరెడ్డి సతీష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు, కార్మికులు రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా వి.వి.రామారావు తుదిశ్వాస విడిచే వరకు కార్మికవర్గ హక్కులు కాపాడడంలో రాజీలేని పోరాటాలు నడిపారని కొనియాడారు. విశాఖపట్నం పోర్టు కార్మిక నాయకుడిగా జాతీయ పోర్టు కార్మిక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ ఏఐటీయూసీ జాతీయ నాయకుడిగా, పోర్టు, చిట్టివలస జ్యూట్‌మిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ తదితర పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి సమర్థవంతమైన నిస్వార్థ నాయకుడిగా సేవలు అందించడమే కాక అసంఘటిత రంగ కార్మికులను సమీకరించి అనేక ఉద్యమాలకు సారథ్యం వహించారని గుర్తుచేశారు. అనేక సమస్యల పరిష్కారంతో పాటు కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను కాపాడడంలోనూ, కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంలో కీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సతీష్, సాయిబాబా, సూర్యనారాయణ, నాగరాజు, శివారెడ్డి, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల ఫోన్లను సీడీపీవోలకు ఇచ్చేస్తాం'



సీడీకి వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీల ఫోన్లను ఈనెల 4న సీడీపీవోలకు ఇచ్చేస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూజిల్లా కమిటీ తీర్మానించింది. ఈమేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, యాప్‌ల పనిభారం తగ్గించాలని, నెట్‌స్పీడ్‌గా వచ్చే సెల్ ఫోన్లు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, వేతనాలు పెంచాలని, చట్టం ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలనే డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా, స్పందించకపోవడం వల్ల ఫోన్లు తిరిగి ఇచ్చేసి, కేవలం రార్డు వర్కు మాత్రమే చేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

'ఆధారాలు లేని విమర్శలు మానుకోవాలి'

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రయత్నిస్తుంటే మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. ఉర్సా సంస్థకు 99 పైసలకే భూమి కేటాయించినట్లు తగిన ఆధారాలు ఉంటే తీసుకురావాలని, దానిపై చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. ఆగస్టు 9న రుషికొండ వేదికగా కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో జరిగే అభివృద్ధిపై, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై చర్చకు సిద్ధమన్నారు. అలానే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రకు మీరు చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉపాధి అంశాలపై చర్చ పెడదామన్నారు.ఇప్పటికే విశాఖలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని తద్వారా అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు, పరిశ్రమకు తేడా తెలయకుండా మంత్రిగా చేసిన అమర్‌నాథ్ పెట్టుబడులు, పరిశ్రమల కోసం మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర పరిశీలకులు చండోలు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత ప్రవేశపెట్టిన కామన్ సీనియారిటీని తొంగలో తొక్కుతూ ఎంఈఓ 1గా కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే నియమించడం అన్యాయమన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల పట్ల వివక్ష తగదని పేర్కొన్నారు. తక్షణమే అపరిష్కృత సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 12న రాష్ట్రస్థాయిలో నిరసన ప్రదర్శన చేపడతామని హెచ్చరించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకుందాం

వామపక్షాల పిలుపు



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు భారమైన విద్యుత్ ప్రీపెయిడ్ (స్మార్ట్) మీటర్ల బిగింపును తక్షణమే నిలిపివేయాలని వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది.ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు గృహ వినియోగదారులకు బిగిస్తే వారిపై మరింత విద్యుత్ భారం పడుతుందన్నారు.ప్రస్తుత విధానం అనుకూలంగా ఉన్నప్పుడు అదాని స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల తయారీపై అదానీతో ఒప్పందం కుదుర్చుకుంటోందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రస్తుత మంత్రి లోకేశ్ పాదయాత్ర సందర్భంగా పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటినే బిగించడం దుర్మార్గ చర్య అని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు డిమాండ్ చేస్తూ ఈనెల 5న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు పాల్గొని తమ అసమ్మతిని తెలియజేయాలని కోరారు. సీపీఐ ఆరిలోవ ఏరియా కార్యదర్శి లక్ష్మణరావు, సిటు మద్దిలపాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేంద్రకుమార్, కాసుబాబు, శంకర్, మహిళా సమాఖ్య నాయకురాలు దేవుడమ్మ, ఐద్వా నాయకురాలు రవణమ్మ, రత్నం పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి యువకుడి మృతి

ఆరిలోవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో బైక్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందాడు. శ్రీకృష్ణాపురం గ్రామానికి చెందిన ముంజేటి జయంత్, హరీష్ శనివారం తెల్లవారుజామున పైనాపిల్ కాలనీ నుంచి బైక్‌పై వస్తుండగా ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. బైక్ వెనుక కూర్చొన్న జయంత్ తలకు తీవ్ర గాయం కాగా, హరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా జయంత్ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మృతి చెందినట్టు అతని తండ్రి రాము ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఎంవీపీ కాలనీ,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తపాలా శాఖ 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనుంది. ఈనెల 5, 11 తేదీల్లో 'అందమైన విశాఖపట్నం' అన్న అంశంపై పోటీలు నిర్వహిస్తారు. అలాగే 6, 12 తేదీల్లో పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్లపై ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు 'విశాఖపట్నం నగరాన్ని ఇంకా అందమైన, అభివృద్ధి నగరంగా ఎలా మార్చాలి' అన్న అంశానికి సంబంధించి కలెక్టరుకు లేఖ రాయాలి. అలాగే 8, 9, 10 తరగతుల విద్యార్థులు 'విశాఖపట్నం నగరాన్ని పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఎలా మార్చాలి' అన్న అంశంపై కలెక్టరుకు లేఖ రాయాలి. ఆయా తేదీల్లో జగదాంబ కూడలి వద్దనున్న సెయింట్ ఆంథోనీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ పోటీ నిర్వహిస్తారు. పేర్ల నమోదుకు, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 90789 79079, 97030 34001 సంప్రదించాలని జిల్లా తపాలా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

నాటక రంగానికి వన్నె తెచ్చిన బళ్లారి రాఘవ

వెంకోజీపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సమాజ ఉద్ధరణకు, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నాటకరంగం ద్వారా బళ్లారి రాఘవ విశేష కృషి చేశారని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు బళ్లారి రాఘవ చిత్రపటానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ ఇతర అధికారులతో కలిసి మేయర్ శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ బళ్లారి రాఘవ క్రిమినల్ కేసులు వాదించడంతో ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించి రావు బహదూర్ బిరుదు ఇచ్చిందన్నారు. తన సంపదను, సమయాన్ని నాటక రంగ పురోగతికి వెచ్చించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీహెచ్ దామోదరరావు, జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, బయాలజిస్టు సాంబమూర్తి, పాల్గొన్నారు.

'ఎంవీవీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి'

సిరిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దళిత అధికారిణి విద్యుల్లతపై అనుచిత వ్యాఖ్యలు చేసి, అవమానించిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై ప్రభుత్వం అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విదసం కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఇటీవల అమరావతి సెక్రటేరియట్‌లో మున్సిపల్ విభాగంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లతపై అనుచిత వ్యాఖ్యలు, బెదిరించడంపై ఆయన స్పందిస్తూ దళిత అధికారిణి పట్ల మాజీ ఎంపీ ఎంవీవీ చేసిన వ్యాఖ్యలలో అహంకారం ఉందని పేర్కొన్నారు.

నక్కవానిపాలెంలో తొలగిన చీకట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలో విద్యుత్ దీపాల సమస్యను అధికారులు పరిష్కరించారు. 'నక్కవానిపాలెంలో అంధకారం' శీర్షికతో ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు స్పందించిన జీవీఎంసీ విద్యుత్ మరమ్మతుల విభాగం శనివారం హైటెన్షన్ పవర్ లైన్‌కు దగ్గర ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. హైటెన్షన్ విద్యుత్ తీగలు దగ్గరగా ఉండటం వల్ల బల్బులు ఎప్పటికప్పుడు కాలిపోతున్నట్లు ఫిర్యాదులు అందడంతో స్తంభాన్ని తొలగించారు. ఆ ప్రాంతంలో చీకటి లేకుండా బల్బులు అమర్చినట్లు జీవీఎంసీ విద్యుత్ మరమ్మతుల విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ విక్రంత్ వర్మ తెలిపారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలకు పాల్పడితే బంగారు భవిష్యత్తు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ శ్రీనివాసరావు

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలని కంచరపాలెం ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీనివాసరావు హితవు పలికారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై ఆర్పీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి అలవాట్లు ఉన్నవారితో స్నేహం చేయరాదన్నారు. ర్యాగింగ్‌తో ఇతరులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. ట్రాఫిక్ నియమాలు వివరించి అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. హెచ్ఎం ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయురాలికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై ఒంటరిగా పడుకొని ఉన్న గౌరీ (50)ని మహారాణిపేట పోలీస్ స్టేషన్ ఎస్సై లక్ష్మి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. విశాఖ జిల్లాలోని దల్లివాడి పాలెం ప్రాంతానికి చెందిన గౌరిని ఆమె భర్త పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి రోడ్లపై ఒంటరిగా తిరుగుతోంది. దీంతో గౌరికి ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని చెప్పారు.

ఆరోగ్యంపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న దుర్గా కళ్యాణి

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జగతి ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా కళ్యాణి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు శనివారం రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. రుతుచక్రంలో మార్పులను వివరించారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, మార్పులు సహజమన్నారు. అనంతరం విద్యార్థినులకు రుతు రుమాళ్లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టరు అనురాధ, డా.ఎస్.ప్రశాంతకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి: సీపీఎం



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న సీపీఎం నాయకులు

అల్లిపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం వేయడం బాధాకరమని సీపీఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం. సుబ్బారావు అన్నారు. శనివారం అల్లిపురం చలువతోటలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.రాజు, సి.హెచ్ చంద్రమౌళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిత కోసం కూటమి ప్రభుత్వాన్నే ఆదరించండి

- రాక్షస వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపిన ప్రజల రుణం తీర్చుకోలేనిది
- 48వ వార్డులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ఇందిరానగర్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడిన ప్రజలకు ఏమిచ్చినా రుణం తీరదని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. జీవీఎంసీ 48వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శనివారం ప్రారంభించారు. కొండవాలు గ్రామాలకు మేలుకలిగించేలా బాపూజీ నగర్‌లో రూ.3 కోట్లతో కల్యాణమండపం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ 48వ వార్డు అభివృద్ధి చెందుతోందన్నారు. కౌన్సిల్‌లో పోరాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువచేస్తున్న కార్పొరేటర్ గంకల కవితను ఎమ్మెల్యే అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పగ్గాలు చేపట్టాక ప్రజలకు భరోసా ఏర్పడిందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికే తమ మద్దతు కొనసాగించి బంగారు భవితకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇందిరానగర్-3, 5 గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంకల అప్పారావు, శ్యామలాదీపిక, జడ్పీ రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దిలీప్, ఏఈ సాయినాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యానవనం అభివృద్ధికి భూమిపూజ

మురళీనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు తెన్నేటినగర్‌లో శనివారం తెన్నేటి విశ్వనాథం ఉద్యానవనం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు భూమిపూజ చేశారు. నిరాదరణకు గురైన పార్కు కనీస వసుతులు లేకుండా మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానికులు చేసుకున్న విన్నపాల మేరకు పనుల ప్రారంభానికి మోక్షం లభించింది. దాదాపు రూ.1.19 కోట్లతో పార్కు నవీకరణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్పొరేటర్ వి.ప్రసాద్, జెడ్పీ బి.రాము, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, సునీల్, 50వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కె.వెంకట్, టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

149 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న స్వామివివేకానంద సంస్థ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి సందర్భంగా వన్‌టౌన్‌లోని స్వామి వివేకానంద సంస్థ శనివారం 149 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించింది. స్వామి వివేకానంద సంస్థ కార్యాలయం నుంచి విక్టోరియా రాణి విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. సంస్థ గౌరవాధ్యక్షుడు సీఎంఏ జహీర్ అహ్మద్ ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 1921లో భారత జాతీయ పతాకాన్ని రూపొందించారన్నారు. ఏటా ఆగస్టు 2న ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింగళి వెంకయ్య విగ్రహాలను అసెంబ్లీ, పార్లమెంట్ ఆవరణలో ఆవిష్కరించాలని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు టి.కృష్ణ, సీహెచ్ నూకరాజు, బాషా, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. తొలుత సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య చిత్రపటానికి డాక్టర్ జహీర్ అహ్మద్ పూలమాలవేసి నివాళులర్పించారు.

మొక్కలకు ఫ్రెండ్లీ బ్యాండ్లు



మొక్కకు బ్యాండ్లు కడుతున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలుగా ఎదగకముందు మొలకెత్తే విత్తనాల మాదిరి స్నేహాలు వికసిస్తాయని రోటరీ క్లబ్ వైజాగ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ అన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మొక్కలకు స్నేహ బ్యాండ్లను విద్యార్థులు కట్టారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటి, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు లక్ష్మీదేవి, డాక్టర్ బాలాజీ, సంతోష్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పనులు.. ప్రజల అవస్థలు

మర్రిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెంలోని శివనగర్‌లో భూగర్భ మురుగు కాలువ (యూజీడీ) పనుల నిమిత్తం కాలనీ ప్రధాన రహదారిని సంబంధిత సిబ్బంది తవ్వారు. ఆ పనులు పూర్తయిన అనంతరం రోడ్డును యథావిధిగా కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురాకుండా రోడ్డును తవ్విన మట్టితో గోతులు కప్పేసి రాకపోకలకు అవకాశం లేకుండా అస్తవ్యస్తంగా వదిలేశారు. రోడ్డుపై వేసిన మట్టికుప్పలను తొలగించకపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పనులు పూర్తి చేసి సుమారు 15 రోజులు గడిచినా సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో రాత్రి సమయాల్లో వృద్ధులు, చిన్నపిల్లలు ఆ రహదారి నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీడీ పనుల కోసం తీసుకు వచ్చిన నిర్మాణ సామగ్రిని ప్రధాన రోడ్డుపైన వదిలేయడంతో వాహనదారులు రాత్రివేళల్లో గమనించలేక అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన శివనగర్ కాలనీ ప్రధాన రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి తమను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన శివనగర్ కాలనీ ప్రధాన రహదారి

తవ్వి వదిలేయడమేనా పని?

సీతమ్మధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ), అమృత మంచినీటి పైపులైన్ల నిమిత్తం రోడ్లు తవ్వి గోతులు పూడ్చకుండా వదిలేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనాలపై వెళ్లి రావడం సాహస ప్రయాణంగా మారింది. రోడ్లు తవ్వి రోజులు గడుస్తున్నా గోతులు కప్పకుండా అలానే వదిలేశారు. వర్షం కురిసినప్పుడు ఆ గోతులు వాన నీటితో నిండిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో వాహనాల టైర్లు కూరుకుపోతున్నాయి. రోడ్లు తవ్వించిన కాంట్రాక్టర్లు తమకు పట్టదన్నట్లు వదిలి వేస్తున్నారు. "యూజీడీ పనులు చేపట్టే వరకే మా వంతు, అమృత నీటి పైపులైన్లు వేసేంతవరకే మా పనులు.. రోడ్లు వేయడం మా పని కాద'ని కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. నక్కవానిపాలెం ప్రధాన రహదారి, ఏఎంజీ ఆసుపత్రి రోడ్డు, వెనుక రోడ్డు, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో జయభేరి నుంచి సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో గోతుల సమస్య నెలకొంది. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



నక్కవానిపాలెంలో తవ్వి వదిలేసిన గోతులు



తవ్వితీసిన మట్టిని చదును చేయని దృశ్యం

ఇంటర్మీడియట్‌లో పెరిగిన ప్రవేశాలు



కళాశాల తరగతి గదిలో నిండుగా విద్యార్థినులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 831 మంది విద్యార్థినులు ప్రవేశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ తెలిపారు. నిరుటికంటే ఈ ఏడాది ఈ సంఖ్య పెరిగిందన్నారు.ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి విద్యార్థినులు 1,470 మంది కళాశాలలో చదువుతున్నారన్నారు. మార్చి 2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలో తమ కళాశాల మొదటిస్థానంలో నిలిచిందన్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈపీడీసీఎల్ అధికారులు 'రేషనలైజేషన్' పేరుతో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎవరైతే అడ్డగోలుగా ఇంక్రిమెంట్లు, పదోన్నతులు తీసుకున్నారో జాబితా రూపొందించి, వారికి అర్హతల ప్రకారమే జూలై నెల జీతాలు ఇచ్చారు. ఇకపై అవే జీతాలు ఇస్తామని స్పష్టంచేశారు. సగటున ఒక్కొక్కరికి రూ.15 వేలు తగ్గిపోయింది. ఇప్పటివరకూ అడ్డగోలుగా, అదనంగా తీసుకున్న జీతాలను ఎలా రికవరీ చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 ఓపెన్, బాలికల చదరంగం పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు శనివారం ముగిశాయి. సమత డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరీలో తనీష్, రమన్ సిద్ధార్థ్, వెంపర్ల వెంకటేశ్వరరావు, వరుణ్‌రాజ్ తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో మధుపడ మనస్వి, శ్రీనందన దత్తు, హేబా షరీన్, సాయి దీప్తి శివకోటి తొలి నాలుగు స్థానాలు సాధించారు. వీరు ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి ఓపెన్, బాలికల చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సమత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు డాక్టర్ బాబురావు, ఎస్.మణికంఠరావు, సునీల్ కుమార్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

బహుభాషా జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ షైజీ తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి అంశంపై ద్వితీయ భాషా విభాగఅధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ భాషలలో 55 మంది అధ్యాపకులు రచించిన వ్యాసాలతో రూపొందించిన 'బహుళ శోధ్ మంజూష' పేరుతో ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.దీప్తి, డా.నిర్మల, డా.కోటేశ్వరరావు, డా.రోజినా, డా.సుధాప్రియ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అందరిలో స్పృహ పెరిగింది: జి.ఎస్.ఎన్.రాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

మాధవధార, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణపై మరింత స్పృహ పెరగాలని ఏయూ మాజీ వీసీ, సెంచూరియన్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు సూచించారు. వాకర్స్‌క్లబ్‌లు ఈ దిశగా మంచి అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తున్నాయని అభినందించారు. శనివారం రాత్రి మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కరోనా తర్వాత ఆరోగ్య స్పృహ పెరిగిందన్న ఆయన, ఆహారపు అలవాట్లు, వ్యాయామ అవసరాల్ని గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకూడని సూచించారు. అనంతరం 'వాకర్స్ వాయిస్' పేరిట క్లబ్ వెలువరించే నెలవారీ సంచికను ఆవిష్కరించారు. వాకర్స్‌క్లబ్ మురళీనగర్ ప్రెసిడెంట్ ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వాకర్స్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్వీ.ప్రసాద్, పూర్వ అధ్యక్షులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేకరీల్లోనూ అదే సీన్

... 5వ పేజీ తరువాయి

ఎస్ఎస్ఎన్ బేకరీ, ఎన్ఎస్టీఎల్ గేటు వద్ద గల పేస్ట్రీ చెఫ్ షాపుల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కొన్నిచోట్ల రెండు, మూడేళ్ల కిందట గడువు తీరిన వస్తువులను కూడా వినియోగిస్తున్నారు. ఎస్ఎస్ఎన్ బేకరీలో ఇలాంటి రంగుల సీసాలను పది వరకూ సీజ్ చేశారు. దయారం స్వీట్స్‌లో ఫంగస్ పట్టి, పాడైన బాదంపప్పును గుర్తించారు. సుమారు 60 ప్యాకెట్లు ఇలా కనిపించాయి. ఈ దుకాణంలో ఆహార పదార్థాల తయారీకి వినియోగించిన కొన్నిరకాల వస్తువుల గడువు కూడా ముగిసినట్టు గుర్తించారు. సీతమ్మధారలోని సాయిలక్ష్మీ స్వీట్స్, సీతంపేట అయ్యంగార్ బేకరీ, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చందు స్వీట్స్, కిసాన్ బేకరీలో నాణ్యత తక్కువగా ఉన్న బిస్కెట్లు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన బాదంపాలు విక్రయిస్తున్నారు.

గడువు తీరినా విక్రయాలు..

అనేక దుకాణాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్స్, కేక్స్, స్వీట్స్ తయారీకి వినియోగించే పదార్థాల గడువు తీరినట్టు అధికారుల తనిఖీల్లో తేలింది. అలాగే, ప్యాకేజీ నిబంధనల ప్రకారం వివరాలు లేని వస్తువులను గుర్తించారు. గడువు దాటి నెలలు, వారాలు గడిచిన ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు ఆయా దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ నిబంధనలు పాటించని షాపులపై 16 కేసులను అధికారులు నమోదుచేశారు. మొత్తం 39 రకాల పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీపీబీ నందాజీ, చక్రవర్తితోపాటు వివిధ శాఖలకు చెందిన 40 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

తనిఖీలు చేపట్టిన దుకాణాలివే...

అధికారులు తనిఖీలు నిర్వహించిన దుకాణాల్లో ప్రముఖ బేకరీ, స్వీట్ దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో కూడా అధ్వాన పరిస్థితులు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఫ్రెష్ చాయిస్, బేకరీ కేస్టలీ, మణికంఠ బేకరీ అండ్ స్వీట్స్ (బేకర్స్ డెన్), సిరిపురంలోని ఫుడ్ ఎక్స్ స్వీట్ ఇండియా, రామ్‌నగర్‌లోని లడ్డూ గోపాల్, శ్యామల డ్రై ఫ్రూట్స్, మద్దిలపాలెంలోని ఎస్ఎస్ఎన్ బేకరీ, క్రౌన్ బేకరీ, దయారం స్వీట్స్, శార్వాణీ స్వీట్స్, ఇసుకతోటలోని స్వగృహ స్వీట్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని చందు స్వీట్స్, ద్వారకానగర్‌లోని గృహప్రియ, మర్రిపాలెంలోని రెడ్‌వాల్వెట్, రైల్వే స్టేషన్ రోడ్డులోని బేకరీ ఎట్ మర్రిపాలెం, మర్రిపాలెంలోని అయ్యంగార్ బేకరీ, పేస్ట్రీ చెఫ్, పెందుర్తిలోని అంబికా స్వీట్స్, సాయిరామ్, సుజాతనగర్‌లోని గోదావరి, ఎన్ఏడీలోని చందు స్వీట్స్, రుచి, రెడ్ చెర్రీ బేకరీ, ఫోర్ సీజన్, ఫ్రెండ్ బేకరీ, మోహన్ స్వీట్స్, గృహ ప్రియ స్వీట్స్, శివరామ్ స్వీట్స్, బెంగళూరు అయ్యంగార్ బేకరీ, తగరపువలసలోని దేవి స్వీట్స్, మణికంఠ స్వీట్స్, పీఎంపాలెం డబుల్ రోడ్డులోని స్వీట్స్ షాప్ 1, 22, కొమ్మాదిలోని టీఎఫ్‌సీ బేకరీ, మిథులాపురి కాలనీలోని అయ్యంగార్ బేకరీ, మధురవాడలోని రెడ్ వాల్వెట్, బి ట్రీట్స్, ఎండాడలోని శ్యామల డ్రై ఫ్రూట్స్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల ఆరో తేదీన ఎన్నిక జరగనున్నది.

పోటీలో ఉన్న అభ్యర్థులు... (బ్రాకెట్‌లో వార్డు, పార్టీ)

1. గంకల కవిత (48, బీజేపీ), 2. దాడి వెంకట రామేశ్వరరావు (89, టీడీపీ), 3. సేనాపతి వసంత (97, టీడీపీ), 4. మొల్లి హేమలత (5, టీడీపీ), 5. మాదంశెట్టి చినతల్లి (84, టీడీపీ), 6. గేదెల లావణ్య (17, టీడీపీ), 7. రాపర్తి త్రివేణివరప్రసాదరావు (93, టీడీపీ), 8.రౌతు శ్రీనివాసరావు (79, టీడీపీ), 9.మొల్లి ముత్యాలు (88, టీడీపీ), 10. కొణతాల నీలిమ (80, టీడీపీ), 11. నక్కెళ్ల లక్ష్మి (20, వైసీపీ), 12. సాది పద్మారెడ్డి (24, వైసీపీ) 13. పల్లా అప్పలకొండ (28, వైసీపీ) 14. బిపిన్‌కుమార్‌జైన్ (31, వైసీపీ) 15. గుండపు నాగేశ్వరరావు (40, వైసీపీ), 16. కోడిగుడ్ల పూర్ణిమ (41; వైసీపీ), 17. రెయ్యి వెంకటరమణ (51, వైసీపీ), 18. కేవీఎన్ శశికళ (55, వైసీపీ), 19. మహ్మద్ ఇమ్రాన్ (66 వైసీపీ), 20. ఉరుకూటి రామచంద్రరావు (70, వైసీపీ).

బడుల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

నిధులతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆ నిధులు ఖర్చు చేయవద్దని ఇటీవల విద్యా శాఖ ఆదేశించింది. ఇదిలావుండగా గత వారం మనబడి-మన భవిష్యత్తు పనులకు ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయవచ్చునని అధికారులు భావించారు. 309 పాఠశాలల్లో పనులు పూర్తికావాలంటే రూ.30 కోట్లు అవసరమని విద్యా శాఖలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదిక రూపొందించారు. అయితే ఆ నిధులను రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన పలు రకాల మెటీరియల్ సరఫరా చేసే సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తికి ప్రత్యేకించి నిధులు మంజూరుచేసేంత వరకూ ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ఏయూ దృష్టి

... 5వ పేజీ తరువాయి

కోర్సుల్లో చేరిన విద్యార్థుల ఈక్వెలెన్స్ (రాష్ట్రానికి చెందిన ఇంటర్మీడియట్ బోర్డుతో సమానంగా గుర్తించేలా) సర్టిఫికెట్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను యూనివర్సిటీకి పంపించాలని ఆదేశించారు. ఆయా విద్యార్థులు ఈ రెండు సర్టిఫికెట్లను ఈ నెల 20వ తేదీలోగా వర్సిటీకి అందించాలని, వాటిని సరిచూసిన తరువాతే సదరు విద్యార్థుల ఫలితాలను వెలువరిస్తామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో ఫేక్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థుల లెక్క తేలుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా చర్యలు ద్వారా భవిష్యత్తులో ఈ తరహా ప్రవేశాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

'ది డెక్'లో రైల్వే జోన్ కార్యాలయం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వెంటనే కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. దాంతో బోర్డు అధికారులు విశాఖ నుంచి వెళ్లిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అప్‌సెట్ ధర అంటే చ.అ. రూ.70 చొప్పున ఇవ్వడానికి వీఎంఆర్‌డీఏ అంగీకరించింది.

వారం రోజుల్లో ఎంఓయూ: శ్రీభరత్

ది డెక్‌లో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వారం రోజుల్లో వీఎంఆర్‌డీఏ, రైల్వే మధ్య ఎంఓయూ జరుగుతుందని, ఆ తరువాత ఇంటీరియర్ పనులు ప్రారంభించి కార్యాలయం ప్రారంభిస్తారని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జోన్ గెజిట్ నోటిఫికేషన్, జోన్ ఆపరేషన్ తేదీ కూడా త్వరలోనే వస్తుందన్నారు.

డ్వాక్రా దుకాణాలకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

లాటరీ తీసి కేటాయించాలని నిర్ణయించారు.

తెర వెనుక లాబీయింగ్

రైతుబజార్లలో వ్యాపారానికి, అక్కడి లాభాలకు అలవాటుపడిన డ్వాక్రా గ్రూపులు మళ్లీ మళ్లీ దుకాణాలు దక్కించుకోవాలని యత్నిస్తున్నాయి. అందుకని అదే గ్రూపులో వేరే సభ్యుల పేరుతో దరఖాస్తులు సమర్పించారు. మరికొందరు వేరే గ్రూపులో చేరి ఆ పేరుతో దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించే బాధ్యత సిటీలో మెప్మాకు, జిల్లాలో డీఆర్‌డీఏకు అప్పగించారు. దాంతో పాటు గోపాలపట్నంలోని మార్కెటింగ్ శాఖాధికారులు కూడా పరిశీలిస్తున్నారు. కొత్త గ్రూపులకు అవకాశం ఇవ్వాలనేది ప్రభుత్వం ఆలోచన. కానీ ఎలాగైనా మళ్లీ దక్కించుకోవాలని కొన్ని డ్వాక్రా గ్రూపులు యత్నిస్తున్నాయి. దాంతో ఎమ్మెల్యేలు, వారి దగ్గర వ్యక్తిగత సహాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇందుకోసం వారు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకూ ముట్టజెబుతున్నారు. ఈ మొత్తాలను కొందరు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద తీసుకొని మరీ ఇస్తున్నారు. దుకాణం వస్తే ఆ వ్యాపారుల దగ్గరే అన్నీ కొనాలనేది ఒప్పందం. ఈ నేపథ్యంలో జిల్లాలో ఒక్కో ఎమ్మెల్యే పదేసి గ్రూపుల పేర్లు సిఫారసు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు ఎమ్మెల్యేలు అయితే తమ వారికి ఫలానా బజారులోనే దుకాణం ఇవ్వాలని ఒత్తిడి పెడుతున్నారు. ఇన్ని సిఫారసుల మధ్య లాటరీ పారదర్శకంగా జరిగే అవకాశం లేదు. గతంలో కూడా మార్కెటింగ్ శాఖలో ఓ అధికారి చక్రం తిప్పి వారి మనుషులకు ప్రధాన బజార్లలో దుకాణాలు ఇప్పించుకున్నారు. అప్పుడు కూడా లాటరీయే తీశారు కానీ వారికి అవసరమైనవి దక్కించుకున్నారు. ఆ అధికారి ఇప్పుడు లేకపోయినా మళ్లీ అదే తంతు నడిపించాలని కొందరు యత్నిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఈ విషయంలో ఎవరినీ విశ్వసించకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా లాటరీ తీయాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన


అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు మాతృశ్రీ నగర్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ కూటమి నాయకులతో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగాయా ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలెం సర్వే 27లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం తగదన్నారు. ఇంతక ముందు ఈ సర్వే నంబర్‌లో వివాదం తలెత్తడంతో వీఎంఆర్‌డీఏ ప్రహరీని నిర్మించిదన్నారు. మధ్యలో రహదారి ఉండడంతో కొంత భూమి ఖాళీగా ఉందన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భుములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తోందని అన్నారు.

ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు రేకుల షెడ్ల నిర్మాణానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నారన్న వార్తల్లో నిజానిజాలు అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. ఈ నిర్మాణాలకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని, లేనిపోని ఆరోపణలు చేస్తున్నావారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ప్రభుత్వ భూములను రక్షించాలని గాజువాక తహశీల్దార్ బి. శ్రీనివాసరావుకు ప్రభుత్వ భూములు రక్షించాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వేగుంట శ్రీనివాస్, రమేశ్, జగదీశ్, గణపతి పాల్గొన్నారు.

ఆ భూములు ప్రభుత్వానివే : గాజువాక తాహసీల్దార్ శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం సర్వే నెంబరు 27లో రాత్రికి రాత్రే వెలసిన షెడ్లు అన్న కథనానికి గాజువాక మండల తాహసీల్థార్ బి.శ్రీనివాసరావు ఎట్టకేలకు స్పందించి ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమిత షెడ్లను పరిశీలించామనీ, సర్వే నెంబరు 27లో 5.48 ఎకరాల భూమి వాగు, పోరంబోకుగా రికార్డుల్లో నమోదై ఉన్నాదని అన్నారు. ఆ భూమి పై న్యాయస్థానంలో రిట్ పిటీషన్, స్టేటస్‌కో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


రాష్ట్రమంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయులు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పెదగంట్యాడ టీడీపీ నాయకులు

పెదగంట్యాడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో సమస్యలున్నాయని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ 75వవార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య రాష్ట్రమంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయులు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈమేరకు గాజువాక టీడీపీ కార్యాలయంలో వారిని కలిసి శనివారం వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ నిర్మాణానికి భూ పత్రాలు అందజేత


ఏపీఐఐసీ అధికారులకు భూ పత్రాలు అందజేస్తున్న పి. గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో ఎంఎస్ఎంఏ ప్లాంటెడ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సేకరించిన 1.45 ఎకరాల భూమిని ఏపీఐఐసీ అధికారులకు రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆయన శనివారం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్ రమేశ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఏ.సింహాచలం, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

విశాఖపట్నం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడి వయసు 58 సంవత్సరాల లోపు ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీగా ఇదివరకు పనిచేసి ఉన్నవారు, క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలకు గురైనవారు అనర్హులు. దరఖాస్తుదారులు తమ బయోడేటాను ఈ నెల 5లోగా ప్రధానోపాధ్యాయుడి ద్వారా అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ లేదా సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, లేదా ఉపవిద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

తల్లిపాల వల్లే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

» సీడీపీవో నీలవేణి


చిన్నారులకు పుస్తకాల పంపిణీలో సీడీపీవో

పెందుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే పిల్లలకు ఆరోమని సీడీపీవో నీలవేణి అన్నారు. సరిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతలను వివరించారు. చంటి పిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలు ఔషధం, సంపూర్ణ ఆరోగ్యమని తెలిపారు. అనంతరం జడ్పీ పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతనం అక్షర చారిటిబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జేసీబీ ప్రసాద్ చిన్నారులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు పిల్లలకు ఔషధం

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి): చంటి పిల్లలకు తల్లి పాలు ఆరోగ్యమని, అవి పిల్లలకు దివ్య ఔషదమని ప్రముఖ పిల్లల వైద్యురాలు డాక్టర్ అనూష అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో శనివారం ని0ర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు రెండు సంవత్సరాలు నిండే వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి బిడ్డకి ఎంతో ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు పెయింటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

» 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డులోని గల్లవానిపాలెం జనచైతన్య లేఅవుట్ కాలనీలో మంచినీటి బోరును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా బోరును ప్రారంభిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పల్లా శ్రీనివాసరావు సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అగనంపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశ జాతీయ పతాకాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి పింగళి వెంకయ్య అని మాహాత్మగాంధీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిత్రా రామారావు అన్నారు. స్థానిక సంత్రం జంక్షన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పింగళి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహాత్మగాంధీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ)లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ఎం. ప్రియదర్శిని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వుడ్ కోటాలో ఈ సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అర్హత గత విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో నేరుగా గురుకుల పాఠశాలకు వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

'హామీలను అమలు చేసిన ఘనత చంద్రబాబుదే!'

కూర్మన్నపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డు కర్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డులో శనివారం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తెలుసుకున్నారు. పలు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే 86వ వార్డులో నిర్వహించిన 'తొలి అడుగు' కార్యక్రమంలో నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాల అందించడమే లక్ష్యంగా కూటమి అడుగులు వేస్తోందని అన్నారు.

పనస పొట్టుకు గిరాకీ

గోపాలపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు బజారులో పనసపొట్టుకు మంచి గిరాకీ ఉంది. పనసకాయల సీజన్ అవడంతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పనసకాయలను తీసుకువచ్చి అమ్ముతున్నారు. పనస పొట్టుతో కూరలు వండుకునేందుకు వినియోగదారులు కొనగోలు చేయడానికి ఎగబడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌ఈజెడ్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల, మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని ఏఈ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల, పాత అగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలిహిల్స్ దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్, మంగళలెం, జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలుసుకో

» టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణానికి, పరిశ్రమకు తేడా తెలియకుండా వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతున్నారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుడివాడ అమర్‌నాథ్ వార్డు మెంబర్‌కు ఎక్కువ.. సర్పంచ్‌కు తక్కువ అని వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో విశాఖలో ఒక్క ఐటీ కంపెనీ పెట్టలేదని, రాజధాని పేరుతో ఉన్నవి వెళ్లగొట్టారని ఆరోపించారు. వైసీపీ అరాచకాలను గ్రహించిన ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్న విషయం గుర్తు చేసుకోవాలన్నారు. అమర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే టీడీపీ అన్నారు. చిన్న వయస్సులోనే కార్పొరేటర్‌గా చంద్రబాబు సీటిచ్చిన విషయం మర్చిపోయి ఆయన్ను విమర్శిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించే స్థాయి అమర్‌కు లేదని చెప్పారు. పరిశ్రమల శాఖా మంత్రిగా పరిశ్రమలు తీసుకురాలేదు సరికదా కోడి గుడ్డు మంత్రిగా రాష్ట్రానికి సుపరిచితమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో సీఎంగా జగన్ విదేశాలకు వెళ్లి ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.

తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని, తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. ఏడాది కాలంలో తాము ఏమి చేశామో చెప్పడానికి బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో)50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, కంద 42, దేముడుచిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

ధాన్యంతో సీఎంకు ధన్యవాదాలు


ధాన్యంతో సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న రైతులు

పెందుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ కూటమి పరిపాలన చేస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రలో ఉన్న రైతులకు ఆర్థిక సహాయం చేసేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం అమలు చేసింది. ఈ పథకం ద్వారా ప్రతిరైతు కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకాన్ని కులుపుకుని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అనుసంధానం చేసి తొలి విడత డబ్బును రైతులకు అందజేసింది. ఈ క్రమంలో పెందుర్తిలో మండలంలో 24 గ్రామాలో 3,126 మంది రైతులకు రూ 2.26 కోట్లు నిధులు వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయని వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో రైతులు తమ గుప్పిట్లో ధాన్యం పట్టుకుని చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై ఆర్థిక భారం : సీపీఎం

మల్కాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అదాని స్మార్ట్ మీటర్లు అమర్చడానికి వీలు లేదని, ఒక వేళ బిగిస్తే పీకి పారేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జగ్గునాయుడు అన్నారు. మల్కాపురం, శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద శనివారం సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలు ప్రజలకు ఎంతో భారంగా మారాయని దీనికి తోడు గడిచిన ఐదేళ్ల కరెంట్ బిల్లుల అదనపు చార్జీలు భారం వేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 5న సీతమ్మధార విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

అక్కిరెడ్డిపాలెం,(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని పడుతుందని, ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ గజువాక జోన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులు బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని సీపీఎం కార్యదర్శి రాంబాబు అన్నారు.

యాచకుడి మృతి

కూర్మన్నపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కనే తుప్పల్లో మనోజ్ అనే బిచ్చగాడి మృతదేహం లభ్యమైంది. గమనించిన స్థానికులు దువ్వాడ సెక్టార్-1 సచివాలయానికి సమాచారం అందించారు. దీంతో అక్కడ గ్రేడ్-2 వీఆర్‌వోగా పనిచేస్తున్న ఎం. పరమేశ్వరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తు అనంతరం మనోజ్ 20 ఏళ్లగా రాజీవ్ నగర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని వివరించారు. మృతుని ముఖం పై గాయాలు, ఉండడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మనోజ్‌దాస్ ఎలా చనిపోయాడో, ఎవరైన కొట్టి చంపారో,త అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వేపగుంట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వేపగుంట- పినగాడి రోడ్డులో ప్రయాణించేందుకు దశాబ్దాలకాలంగా వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఆ ఇబ్బందులు తీరనున్నాయి. రూ.15 కోట్లతో 60 అడుగుల పూర్తిస్థాయి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, అదేవిధంగా వేపగుంట- చిమలాపల్లిలో రోడ్డులోని డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో నూతనంగా రూ.8.23 కోట్ల ఉడా నిధులతో చేపట్టిన కన్వెన్షన్ సెంటర్‌ను ఉడా చైర్మన్ ప్రణవ్ గోపాల్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు.

టీబీ వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్‌లు నిత్యం వాకింగ్, యోగ వంటివి చేయడంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అనూష అన్నారు. అగనంపూడి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం 68 వార్డు అక్కిరెడ్డిపాలెంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది సీనియర్ సిటిజన్‌లు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

దుకాణాలు తొలగించొద్దంటూ నిరసన

గాజువాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు ఉడా కాలనీ, గాంధీనగర్‌లో రహదారి పక్కన ఉన్న దుకాణాలను జీవీఎంసీ సిబ్బంది తొలగించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం ఉదయం జీవీఎంసీ సిబ్బంది జేసీబీలతో ఉడా కాలనీ, గాంధీనగర్‌లో రహదారి పక్కన ఉన్న దుకాణాలను తొలగించే ప్రయత్నం చేయడంతో వ్యాపారులు అడ్డుకున్నారు. 30 ఏళ్లగా రహదారి పక్కనే వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నామని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఏమిటని నిరసన వ్యక్తం చేశారు. వార్డు కార్పొరేటర్ గంధం శ్రీను ప్రయోజనాల కోసమే ఈ దుకాణాల తొలగింపని పలువురు ఆరోపించారు.

'పీఎఫ్ ఖాతాల్లో తప్పులను సరిచేయాలి'

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పీఎఫ్ ఖాతాల్లో 'డేట్ ఆఫ్ జాయినింగ్ నమోదులో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని, సుమారు 140 మంది కార్మికులు ఆరు నెలలుగా అభ్యర్థనలు పెడుతుంటే యాజమాన్యం నిర్లక్షంగా వ్యవహరించడం ప్రోగ్రసివ్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ అన్నారు. పిఎఫ్ సమస్యతో పాటు హయ్యర్ పెన్షన్ అమలు వంటి పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ ప్రోగ్రసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం భెల్ టౌన్ షిప్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్య వల్ల పదవీ విరమణ చేస్తున్న కార్మికుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోతోందని, దీని వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్యను యాజమాన్యం తక్షణమే పరిష్కరించి కార్మగారంలో హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఇంటక్ నాయకుడు సీతం నాయుడు డిమాండ్ చేశారు.

స్నేహమేరా శాశ్వతం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం.. స్నేహమేరా సన్నిధి.. స్నేహమేరా పెన్నిధి'.. స్నేహం గొప్పతనాన్ని మూడు ముక్కల్లో చెప్పాడో సినీ కవి. స్వచ్ఛమైన స్నేహానికి మించింది ప్రపంచంలో మరేది లేదు. శరీరాలు రెండైనా ఆత్మ ఒక్కటే అయి ఉండాలి. మనసులు రెండైనా ఆలోచనలు ఒకటే అయి ఉండాలి. అదే పరిశుద్ధమైన స్నేహం. స్నేహాన్ని కొలిచే సాధనాలు లేవు. కొలమానాలు అంతకంటే దొరకవు. స్నేహ మాధుర్యాన్ని నిర్వచించే అక్షరాలు లేవు. స్నేహం అజరామరం. మనుషులు అశాశ్వతం. స్నేహం శాశ్వతం. సృష్టి ఉన్నంత కాలం స్నేహం ఉంటుంది. స్నేహితుడు ఉంటాడు. స్నేహంలో ఉండే ఆర్ద్రత, మాధుర్యాన్ని ఆస్వాదించగలిగిన వారే నిజమైన స్నేహితులు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- కష్టసుఖాల్లో తోడుండే వారే నిజమైన స్నేహితులు
- నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావులేదు
- ధనిక, పేద అనే తారతమ్యాలూ ఉండవు



ప్రతిఒక్కరి జీవితంలో తల్లిదండ్రులు, సోదరులు, అక్కాచెల్లెల్లు, పిల్లలు వంటి బంధాలు ఉంటాయి. ఈ బంధాలతో సమానంగా నిలిచే మరో బంధమే స్నేహం. అందరి జీవితంలో స్నేహానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. మంచి స్నేహితుడు తోడుంటే జీవితంలో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశం ఉంది. మంచి స్నేహాల వల్ల ఉన్నత స్థానాలకు చేరుకున్న వాళ్లు ఉన్నట్టే.. చెడు స్నేహాలతో పతనాన్ని చవిచూసిన వాళ్లూ ఉన్నారు. కాబట్టి స్నేహితుడి ఎంపిక కూడా అత్యంత కీలకం. చెడు సావాసాలు జీవితాలను నాశనం చేస్తాయని పెద్దలు చెబుతుంటారు. అలాగే మంచి స్నేహితుడు ఉన్నత స్థానాలను చేరుకునేందుకు దోహదం చేస్తాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కాబట్టి కష్టసుఖాల్లో అండగా నిలిచే మంచి స్నేహితుడిని పొందడం అదృష్టంగానే భావించాలి. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు, కష్టసుఖాల్లో అండగా నిలిచిన స్నేహితులను గుర్తు చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఏటా ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారాన్ని స్నేహితులు దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

1935లో ఆగస్టు మొదటి శనివారం అమెరికా ప్రభుత్వం చేతిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. తన స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక మరో వ్యక్తి ఆ మరుసటి రోజైన ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు చలించిన అమెరికా ప్రభుత్వం 1935లో యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ ఆగస్టు మొదటి ఆదివారాన్ని జాతీయ స్నేహితుల దినోత్సంగా ప్రకటించింది. అప్పటినుంచి క్రమంగా అనేక దేశాలు స్నేహితులు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి.

స్నేహితుడు ఎలా ఉండాలంటే..

స్నేహితుడు ఎలా ఉండాలన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. అయితే నిజమైన స్నేహితుడు ఎప్పుడూ నమ్మకమైన వాడిగా ఉండాలి. సహాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. కష్టసుఖాల్లో నిరంతరం తోడుగా ఉండేవాడిని మాత్రమే స్నేహితుడిగా భావించాలి. స్నేహితుడి ఎదుగుదలను, మంచిని కోరుకునే వ్యక్తే నిజమైన స్నేహితుడు అని చెబుతారు. స్నేహితుడు చేసే మంచి, చెడులను నిర్మొహమాటంగా చెప్పి సరైన మార్గంలో నడుచుకునేలా చేస్తాడు. స్నేహితులు మధ్య దాపరికాలు ఉండవు. ఒకరి పట్ల ఒకరికి ప్రేమ, ఆప్యాయత, అభిమానాలు మాత్రమే ఉంటా యి. నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావు లేదు... ధనిక, పేద అనే తారతమ్యాలూ ఉండవు.



చాంతాడ జాబితా వద్దు

ప్రస్తుతం యువత స్నేహితులు చిట్టా చూస్తే చాంతాడంతా ఉంటోంది. ఊరు, పేరు, ముఖం తెలియనివాళ్లు కూడా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహాలు చేస్తున్నారు. ఇటువంటి వారిని స్నేహితులుగా ఎంతోమంది భావిస్తున్నారు. అయితే ఇటువంటి స్నేహాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఈ తరహా స్నేహితులతో మోసాలకు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వందలకొద్దీ స్నేహితుల జాబితా ఉన్నప్పటికీ కష్ట, సుఖాల్లో అండగా లేనప్పుడు ప్రయోజనం లేదన్నది పెద్దల మాట. అందువల్ల మంచి కోరుకునే ఇద్దరు, ముగ్గురు నిజమైన స్నేహితులుంటే చాలు. అటువంటి స్నేహితులను ఎంపిక చేసుకోవడం అత్యంత కీలకం.

నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా..

సంబరాలు నిర్వహించుకునేలా..



స్నేహితుల దినోత్సవం రోజు ఇష్టమైన స్నేహితులకు బహుమతులు అందించి సెలబ్రేట్ చేసుకుంటారు. నగరంలోనూ స్నేహతుల దినోత్సవాన్ని జరుపుకునేందుకు యువత సిద్ధమవుతున్నారు. ఏళ్లతరబడి స్నేహాన్ని కొనసాగిస్తున్న ఎంతోమంది స్నేహితుల దినోత్సవం రోజున నగర పరిధిలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో కలుకుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే నగరంలో స్నేహితుల దినోత్సవ సందడి ప్రారంభమైంది. వివిధ రకాల గిఫ్టులు, స్పెషల్ కేక్స్, స్వీట్స్ వంటివి సిద్ధం చేసి 'ఫ్రెండ్‌షిప్ డే' స్పెషల్ పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు. తమకు ఇష్టమైన స్నేహితుడికి మంచి బహుమతిని అందించేందుకు ఎంతోమంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా గిఫ్ట్ స్టోర్స్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

ఎటువంటి లక్షణాలు ఉండాలంటే..

మంచి స్నేహితుడు ఎప్పుడూ కొన్ని సద్గుణాలను కలిగి ఉండాలి. స్నేహితుడిలో కొన్ని మంచి లక్షణాలను చూసుకోవాలి. అటువంటి లక్షణాలు ఉన్నవారితో సాన్నిహిత్యంగా ఉండడం కీలకం. మన హితాన్ని కోరుకునే వాడై ఉండాలి. తప్పు, ఒప్పులను నిర్మొహమాటంగా చెప్పాలి. ఆలోచనలు, అభిరుచులు కలిసిన స్నేహితులతో స్వీయాభివృద్ధి ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక అవసరాలు, ఇతర అవకాశాల కోసం చూసేవారిని ఎప్పుడూ స్నేహితులుగా భావించరాదు. దురలవాట్లతో కూడిన వ్యక్తులతో స్నేహం జీవితాన్ని ప్రమాదంలోకి నెడుతుంది. జీవితం పట్ల, లక్ష్యం పట్ల స్పష్టత ఉన్న వ్యక్తులు, దూరదృష్టి కలిగిన వారిని స్నేహితులుగా ఎంపిక చేసుకోవడం ఎంతో మంచిది.

చరిత్రాత్మకం 'అన్నదాత సుఖీభవ' పథకం

- రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

గాజువాక , ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు ద్వారా రైతన్నలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు నిలబెట్టుకున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ వికాస్' పథకం మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం చరిత్రాత్మకమైనదని, తొలివిడతగా రాష్ట్రంలోని రైతన్నల ఖాతాల్లో రూ.3,174 కోట్ల నిధులను జమ చేయడం హర్షణీయమన్నారు. విశాఖ జిల్లాలో 18,753 మంది రైతులకు రూ.12,90,65,000 జమ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులు తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు తప్పుడు మెయిల్స్ పెట్టించడం వైసీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. 'ఉత్తర' ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలనను అందించి ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, మాజీ ఎమ్మెల్సీ డి.రామారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఆపే సత్తా, శక్తి చంద్రబాబుకు ఉన్నాయి

- ఆయన చెబితే మోదీ ప్రభుత్వం వినాల్సిందే
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా ఆపే సత్తా, శక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఉన్నాయని, ఆయన చెబితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం వినాల్సిందేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 'విశాఖ ఉక్కు నేటి పరిస్థితి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రధాన పార్టీలు తెలుగుదేశం, జనసేన, వైసీపీలు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని చెబుతూనే బీజేపీ విధానాలకు మద్దతు ఇస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం సోషలిస్టులను వ్యతిరేకిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఉండవల్లి అన్నారు. చంద్రబాబునాయుడు గట్టిగా తలుచుకుంటే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఇప్పటికిప్పుడు ఆగుతుందన్నారు. చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో విశాఖ ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్‌కు రాసిన లేఖలో వైసీపీ ప్రభుత్వం నాయకత్వంలో వామపక్ష పార్టీలన్నిటినీ కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారని గుర్తుచేశారు. ఈ రోజున ఆ అవకాశం చంద్రబాబుకే వచ్చిందన్నారు. చంద్రబాబునాయుడు ఇతర పార్టీలన్నింటినీ కలుపుకొని కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం తెలుగుదేశం, జనసేనపై ఆధారపడి ఉందని, దీనిని ఆయుధంగా చేసుకొని పోరాటం చేస్తే ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఆగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోదీని ఎదిరించి నిలవగలిగే శక్తి కేవలం చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిలా చంద్రబాబునాయుడు మొదటిసారి ముఖ్యమంత్రి కాదని రాజకీయంగా ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి అన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విషయంలో గతంలో పవన్‌కల్యాణ్ ఎంత తీవ్రంగా మాట్లాడారో మనమంతా చూశామన్నారు. ఉక్కు పరిశ్రమ విషయంలో చంద్రబాబునాయుడు పక్కకు తప్పుకున్నా, పవన్‌కల్యాణ్ ప్రైవేటీకరణ ఆపుతాడని తనకు నమ్మకం ఉందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపడానికి ఏ పార్టీ ముందుకు వచ్చినా తన మద్దతు పూర్తిగా ఉంటుందన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ సెయిల్‌లో విలీనం లేదా సొంత గనులు కేటాయింపు ద్వారా మాత్రమే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుదన్నారు. అదేవిధంగా రూ.11,440 కోట్ల ప్యాకేజీ చాలా చిన్నదని, అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎస్.రామచంద్రరావు, పరంధామయ్య, బీవీకే రాజు, జ్యోతీశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు వీవీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులపై నిర్బంధం ఆపాలని, ఈ మేరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్. చిత్రంలో కమిటీ నాయకులు సీహెచ్ నరసింగరావు

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆటోమ్యూటేషన్‌ను పరిశీలించిన కమిషనర్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని సూపర్‌బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం సందర్శించారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆయా ఆస్తులు కొనుగోలు చేసుకున్న వ్యక్తుల పేరుకి ఆటోమెటిక్‌గా మారిపోయేలా (ఆటోమ్యూటేషన్) సౌలభ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఎవరైనా ఆస్తులు కొనుగోలు చేసుకుంటే వాటిని ముందుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని, డాక్యుమెంట్లు వచ్చాక వాటిని జీవీఎంసీ కార్యాలయానికి తీసుకువెళ్లి ఆస్తులను తమ పేరిట మ్యూటేషన్ చేయాలని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు పరిశీలించాక ఆయా ఆస్తులకు అసెస్‌మెంట్ నంబర్ జారీ చేయడం/యజమాని పేరును మార్చడం వంటివి చేసేవారు. దీనివల్ల ఆస్తులు కొనుగోలు చేసుకున్నవారు వాటిని తమ పేరిట మార్చుకునేందుకు సమయం కేటాయించడంతోపాటు జీవీఎంసీ కార్యాలయం, అధికారులు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి ఆటోమ్యూటేషన్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానంలో ఎవరైనా ఆస్తులను కొనుగోలు చేస్తే వాటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నపుడే ఆ ఆస్తి వారి పేరుకి బదిలీ (ఆటోమ్యూటేషన్) అయిపోతోంది. రిజిస్ట్రేషన్ సమయంలోనే జీవీఎంసీకి చెల్లించాల్సిన ఆటోమ్యూటేషన్‌కు సంబంధించిన ఫీజులను రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆటోమ్యూటేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలుసుకునేందుకు కమిషనర్ సూపర్‌బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రిజిస్ట్రేషన్లు, ఆటోమ్యూటేషన్ జరుగుతున్న తీరును స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణతో కలిసి పరిశీలించారు. అక్కడ సిబ్బందిని కొన్ని సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆటోమ్యూటేషన్ వివరాలకు సంబంధించి కమిషనర్ కొన్ని సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారితో రిజిస్ట్రేషన్, ఆటోమ్యూటేషన్‌కు సంబంధించిన అంశాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఆటోమ్యూటేషన్‌కు సంబంధించిన కొన్ని సాంకేతిక సమస్యలను బాలకృష్ణ జీవీఎంసీ కమిషనర్‌కు వివరించారు. ఏమైనా సమస్యలు, ఇబ్బందులుంటే రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు లేదా ఆయా జడ్సీలను సంప్రదించాలని సూచించారు.

విద్యాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలను రూపొందించాలి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక, శారీరక, విద్యాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. కొటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హోటల్ డైమండ్ పెరల్‌లో నిర్వహించిన సెల్ఫ్ లీడర్ షిప్ వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవ్వగా, జోన్-1 పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకు లాలకు చెందిన 33 మంది ప్రిన్సి పాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రిన్సిపాళ్లు నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎలా కాపాడాలి, వారి మానసిక, విద్యాభివృద్ధికి ఎలా దోహద పడాలనే అంశాలను వివరించారు. విద్యా సంస్థల్లో సానుకూలమైన మార్పులు తెచ్చేందుకు ప్రిన్సిపాళ్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులతోపాటు 80 మందికి లాంగ్ టర్మ్ నీట్ కోచింగ్ అందించి వారిని వైద్యులుగా తీర్చిదిద్దే దిశగా ప్రోత్సహిస్తామని మంత్రి పేర్కొన్నారు. కొటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సభ్యులు థామస్, మిస్టర్ ఫరీజ్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా డీసీవో ఎస్.రామకృష్ణ, విజయనగరం డీసీవో ఎస్.రూపావతి, శ్రీకాకుళం డీసీవో జి.గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం లలితాదేవి ఆలయం సమీప వీధిలో ఒంటరిగా (వివాహం కాలేదు) నివాసం ఉంటున్న రంగస్వామి కిరణ్‌కుమార్(50) ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పైఇంటిలో కిరణ్‌కుమార్ సోదరుడు రంగస్వామి సత్య వెంకటరాజన్ కిందికి దిగుతుండగా దుర్వాసన వచ్చింది. తలుపులు గెడ లోపల వేసి ఉండటంతో 112కి ఫోను చేసి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న నాలుగో పట్టణ పోలీసులు తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూసేసరికి కిరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతదేహం కూడా కుళ్లిపోయి ఉంది. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.30 వేల విలువైన ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాలోని బ్రహ్మపూర్‌కు చెందిన సిలు దలై (21) అనే నిందితుడు గంజాయి రవాణా చేస్తూ దొరికాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

ఉక్కు టౌన్‌షిప్‌లో చైన్ స్నాచింగ్

ఉక్కునగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉక్కు టౌన్‌షిప్ సెక్టార్-12లో శనివారం ఉదయం ఓ మహిళ మెడ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయారు. సెక్టార్-12లోని 163-బీ క్వార్టర్‌లో ఉంటున్న కుర్రా ఉమాదేవి ఉదయం సెక్టారులో వాకింగ్ చేస్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల రెండు పేట్ల బంగారం చైన్‌ను తెంచేందుకు ప్రయత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో సుమారు రెండు తులాల ఒక వరుస బంగారు చైను ఆమె చేతిలో ఉండిపోగా, మిగిలిన రెండు తులాల చైన్‌ను దుండగులు తెంచుకుని పారిపోయారు. ఉమాదేవి స్టీల్ ప్లాంట్ క్రైమ్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచన

మహారాణిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలకు అండగా నిలుస్తూ, అన్ని రకాల అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాలను వారికి చేరువ చేయాలని కోరారు. ఇప్పటి వరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరిశోధన దశలో 147, పెండింగ్ ట్రయిల్‌లో 695 కేసులు ఉన్నాయని, దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహిస్తూ, బాధితులకు అండగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత్ మేరీ, డీఆర్‌వో భవానీ శంకర్, ఆర్‌డీవో శ్రీలేఖ, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. రామారావు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్‌వో భవానీ శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కళా రంగానికి రాఘవ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్‌లో..

బళ్లారి రాఘవ 145వ జయంతి కార్యక్రమాన్ని పోలీసు కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను స్మరించుకుంటూ తెలుగు నాటక రంగానికి రాఘవ చేసిన సేవలను కొనియాడారు.

సమస్యల సామరస్య పరిష్కారానికి శాంతి కమిటీ

- పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడి



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, మైనారిటీలు

మహారాణిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సమస్యలను శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించటానికి శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ డా శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగరంలో మైనారిటీల సమస్యలు తెలుసుకొని, వాటిపై చర్చించి పరిష్కరించటానికి శనివారం పోలీసు కమీషనరేట్ సమావేశమందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. హాజరైన క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీల నాయకులతో సమావేశమయ్యారు. కమిషనర్ బాగ్చి వారితో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మైనారిటీ వర్గాల మధ్య తలెత్తే సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశామని, అందులో పోలీసులు కూడా సభ్యులుగా ఉంటారన్నారు. సమస్యలను పరస్పర సహకారంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజండ్ల, మేరీ ప్రశాంతి, సుమారు 60 మంది మైనారిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్‌లో డీసీపీలకు జోన్ల కేటాయింపు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ)లుగా పనిచేస్తున్న అధికారులకు జోన్లను కేటాయిస్తూ కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఎంఆర్‌డీఏ నుంచి ఇటీవల జీవీఎంసీకి బదిలీపై వచ్చిన కె.వెంకటేశ్వరరావుకు జోన్-1 (భీమిలి), జోన్-6 (గాజువాక) కేటాయించారు. జోన్-3 ఏసీపీగా పనిచేస్తూ ఇటీవల డీసీపీగా పదోన్నతి పొందిన సీహెచ్ మధుసూదనరావుకు జోన్-3 (ఆశీల్‌మెట్ట) ఇన్‌చార్జి ఏసీపీగా కొనసాగిస్తూనే జోన్-3, జోన్-7 (అనకాపల్లి) జోన్లను కేటాయించారు. అలాగే కె.హరిదాసుకి జోన్-2 (మధురవాడ), జోన్-4 (సూర్యాబాగ్), టీజీ రామ్మోహన్‌కు జోన్-5 (జ్ఞానాపురం), జోన్-8 (పెందుర్తి) కేటాయించారు. వీరంతా జోన్ స్థాయిలో ఏసీపీలకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా సిటీ ప్లానర్, చీఫ్ సిటీ ప్లానర్‌తో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని కమిషనర్ ఆదేశించారు.